www.flashindianews.com

FLASH INDIA NEWS ప్రశ్నిస్తాం.. ప్రజలకోసం...

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229

సంపుటి : 17 | సంచిక : 145 | శనివారం 11.07.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-



విలేకరులు కావలెను

18 సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు,నియోజకవర్గాల, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..

సెల్ నెంబర్: 9951494039


## ఎక్కడ 'సర్'.. మీ చిరునామా?

### 2002 ఓటరు వివరాలే ప్రధాన అడ్డంకి

గడువులోపు నమోదు పూర్తి చేయడమే లక్ష్యం

ఓటర్ల సహకారం లేక పెరుగుతున్న పెండింగ్

### గుర్తింపు లేక బీఎల్ఓల ఆవేదన




- బీఎల్ఓలకు క్షేత్రస్థాయిలో కష్టాల మయం
- ఇంటింటి సర్వేలో తీవ్ర ఇబ్బందులు
- 10–15 కిలోల ఫైళ్లతో ఇంటింటి తిరుగు
- 2002 ఓటరు వివరాలే ప్రధాన అడ్డంకి
- చిరునామాలు మారడంతో పెరుగుతున్న సమస్యలు
- ఫారాలు నింపడంలో ఓటర్లకు గందరగోళం
- బీఎల్ఓల వద్దకు సహాయం కోసం క్యూ
- చివరి గడువుపై అధికారుల్లో ఆందోళన
- కాటేదాన్‌లో కార్మికుల జాడే లేదు

02

# 2029 జూన్ లోనే అసెంబ్లీ ఎన్నికలు..

మీ రాజకీయాల కోసం 44 గ్రామాలు మునగాలా?

## కల్వకుంట్ల కౌరవ కుటుంబాన్ని పాతాళానికి తొక్కుతాం

తాటిచెట్టంత పెరిగిన ఆయనకు... బుర్రలో గుజ్జు లేదు

ఎన్నికల్లో 117 సీట్లు గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తాం

నా రాజకీయ ఎదుగుదలకు ఖమ్మమే గుండెకాయ..



- హరీశ్రావు బీజేపీ నేతలతో రాత్రి మంతనాలు చేస్తున్నారు
- బీజేపీతో మంతనాలు చేయట్లేదని హరీశ్రావు ప్రమాణం చేస్తారా?
- భద్రాచలం రాముడిపై హరీశ్ రావు ప్రమాణం చేస్తారా?
- తాటిచెట్టంత పెరిగిన ఆయనకు... బుర్రలో గుజ్జు లేదు
- కాసుకో కేసీఆర్.. నిన్ను, నీ బంధువులను, దొంగ సర్వేలను ఓడిస్తాం
- మిమ్మల్ని ఓడించేందుకు రోజూ 18 గంటలు పనిచేస్తాం
- మిమ్మల్ని ఓడించేవరకు విశ్రమించను
- పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ సీట్లు 17 నుంచి 26గా మారతాయి
- వచ్చే శాసనసభ ఎన్నికలు 2028 డిసెంబర్ జరగవు
- 2029 మే, జూన్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి
- అసెంబ్లీ సీట్లు 119 నుంచి 182కు పెరుగుతాయి
- ఎన్నికల్లో 117 సీట్లు గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తాం

03

బీజేపీలోకి వెళ్లనని..మీ మామ మీద, ఆ రాముడి మీద ఒట్టేయ్..హరీశ్ కు రేవంత్ సవాల్



**ఖమ్మం,ఫ్లాష్ ఇండియా :**
పాపాల బైరవుడు కేసీఆర్‌ను ఫామ్ హౌస్‌లో బంధించామని ఆ పాపాల బై-రవుడికి ఇక విముక్తి లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. గత ఎన్నికల్లో చెప్పి మరీ బీఆర్ఎస్‌ను పాతాళానికి తొక్కామని మళ్లీ చెబుతున్నా జరగబోయే కురక్షేత్రంలో గెలిచేది మేమే అని.. కల్వకల్వకుంట్ల కౌరవ కుటుంబాన్ని పాతాళానికి తొక్కేది మేమే అన్నారు. ఇవాళ ఖమ్మం జిల్లా చింతకాని మండలం మత్కెపల్లిలో నిర్వహించిన రైతు ఆశీర్వాద సభలో మాట్లాడిన రేవంత్ రెడ్డి బీఆర్ఎస్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ అసెంబ్లీకి 2028 డిసెంబర్‌లో ఎన్నికలు జరగవని 2009 జూన్ లోనే ఎన్నికలు జరుగుతాయన్నారు. కేసీఆర్, ఆయన కుమారుడు, అల్లుడు, కూతురు, భజన పరులు, ఒప్పంద పరులు, దొంగ సర్వేలు చేసే ఏజెన్సీలు సహా అందరూ ఈ విషయాన్ని గుర్తు పెట్టుకోకోండి..

## జాతీయ స్థాయిలో సింగరేణికి మరో ఘనత

జాతీయ అవార్డులతో సింగరేణి ప్రతిష్ఠ మరింత పెంపు

90 శాతానికి పైగా మార్కులతో 5-స్టార్ మరో 17 గనులకు 4-స్టార్ రేటింగ్

- జాతీయ స్థాయిలో సింగరేణి ఐదు గనులకు 5-స్టార్ గుర్తింపు
- దేశవ్యాప్తంగా సింగరేణి గనులు మరోసారి సత్తా చాటాయి
- సింగరేణి ఐదు గనులకు అత్యున్నత జాతీయ గుర్తింపు లభించింది
- భద్రతా ప్రమాణాల్లో సింగరేణి గనులు ముందంజలో నిలిచాయి
- సింగరేణి గనులకు కేంద్రం ప్రతిష్ఠాత్మక 5-స్టార్ రేటింగ్ ప్రకటించింది
- పర్యావరణ పరిరక్షణలో సింగరేణి గనులకు జాతీయ ప్రశంసలు దక్కాయి

02




## పోరాటం చేస్తే మెడికల్ బోర్డు పెట్టారు

- కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులను అయోమయంలోకి నెట్టింది
- డిపెండెంట్ నియామకాలు వెంటనే పూర్తి చేయాలి
- కార్మికులకు క్షమాపణ చెప్పిన కవిత
- 3 వేల ఖాళీలు భర్తీ చేయాలని డిమాండ్
- మెడికల్ బోర్డుపై ప్రభుత్వాన్ని నిలదీత
- 2 వేల దరఖాస్తులు పెండింగ్‌లోనే
- రిటైర్మెంట్‌కు ముందే ఉద్యోగాలు ఇవ్వాలి
- 20 నుంచి నిరవధిక సమ్మె హెచ్చరిక
- ధర్నాల తర్వాతే స్పందించడం సరైంది కాదు
- దరఖాస్తు తేదీ ఆధారంగానే నియామకాలు చేయాలి

03



ప్రతి నెల రెండుసార్లు మెడికల్ బోర్డు పెట్టాలని లేని పక్షంలో ఈనెల 20వ తేదీ నుండి నిరవధిక సమ్మె గాంధీ మార్గంలో చేస్తామని చెప్పడం జరిగిందన్నారు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఏఐటీయూసీ యూనియన్ నుంచి పలాన తారీకు నుండి మెడికల్ బోర్డు అని, ఐ ఎన్ టి యు సి యూనియన్ నుండి పలాన తారీకు నుండి మెడికల్ బోర్డు అని మెసేజ్ లు ఇప్పిస్తున్నారని, ఇలాంటి లీక్ వీరుల ప్రభుత్వం మనకు వద్దన్నారు. ఏదైనా భాజప్తిగా ప్రకటన ఇవ్వాలన్నారు. ధర్నాలు చేసినప్పుడే చెపా-మంటే కరెక్ట్ పద్ధతి కాదన్నారు. ఎవరైతే డిపెండెంట్ ఏ తారీఖున అప్లికేషన్ పెట్టారో అదే తేదీని ప్రాతిపదికన తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఏపీలో మళ్లీ కరోనా టెర్రర్..

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచనలు
- మృతుల గ్రామాల్లో వైద్య బృందాల పర్యటన
- వ్యాప్తి నివారణకు చర్యలు ముమ్మరం
- కరోనా పరిస్థితిపై ఉత్కంఠ కొనసాగుతోంది
- అధికారిక ప్రకటన కోసం ఎదురు చూపులు

05




## మెటా షాకింగ్ రిప్లై!

- ఈ ఏడాది చివర్లో యూజర్‌నేమ్ ఫీచర్
- దశలవారీగా అందుబాటులోకి కొత్త ఫీచర్
- ఫోన్ నంబర్ దాచి చాట్ చేసే అవకాశం
- కొత్త అకౌంట్‌కు ఫోన్ నంబర్ తప్పనిసరి
- వెరిఫైడ్ పేర్లు ముందుగానే రిజర్వ్

05






## హరీష్ రావుకు కాంగ్రెస్ 'ఆఫర్'..

### మహేష్ కుమార్ గౌడ్ ఓపెన్ స్టేట్‌మెంట్

నీళ్ల దోపిడీ సమయంలో ఈటల ఏం చేశారు?

- బీఆర్ఎస్, బీజేపీలపై మహేష్ కుమార్ గౌడ్ ఫైర్
- హరీష్‌రావుపై పీసీసీ చీఫ్ ఘాటు విమర్శలు
- 'మూడు నెలల గడువు ఎందుకు ఇవ్వాలి?'
- కుంగిన ప్రాజెక్టులపై సమాధానం చెప్పాలి
- హరీష్ కాంగ్రెస్‌లోకి వస్తే కమిటీ నిర్ణయం
- బీఆర్ఎస్ నిధులపై అనుమానాలు
- రూ.1,400 కోట్లపై వివరణ కోరిన కాంగ్రెస్
- అంతర్గత విభేదాలపై అబ్జర్వర్ల నియామకం

05

బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌పై కూడా మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. రాష్ట్రంలో నీళ్ల దోపిడీ జరిగినప్పుడు, ప్రజల సొత్తు దుర్వినియోగం అయినప్పుడు ఈటల బీఆర్ఎస్ (ఆనాటి టీఆర్ఎస్)లోనే ఉన్నారని, ఆర్థిక మంత్రిగా కూడా పనిచేశారని గుర్తుచేశారు. ఆనాడు జరిగిన తప్పిదాలను ప్రశ్నించకుండా మౌనంగా ఉన్న ఈటల.. ఇప్పుడు బీఆర్ఎస్‌కు మద్దతు పలుకుతున్నట్లు కనిపిస్తోందని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ 12...

## నాకు తెలంగాణే ఫస్ట్..

### ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులకు కష్టాలు

కాళేశ్వరం మరమ్మతులు వెంటనే చేపట్టాలి

- ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులకు కష్టాలు
- ప్రాజెక్టుల్లో నీళ్లు ఉన్నా మోటార్లు బంద్
- సాగునీటి నిర్వహణపై ప్రభుత్వానికి ప్రశ్నలు
- ఎస్ఆర్ఎస్పీ నీటిపై ఈటల వివరణ

03



ఎగువ రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురిసి తెలంగాణలోని ప్రాజెక్టుల్లోకి నీళ్లు వస్తున్నా.. ప్రభుత్వం మోటార్లు ఆన్ చేయకుండా అన్నదాతలను కష్టాల పాలు చేయడం భావ్యం కాదన్నారు. వర్షాకాలం పంటలకు నీళ్లు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన వ్యాఖ్యానించారు.




## హైదరాబాద్‌లో డ్రగ్స్ కలకలం..

- అత్తాపూర్‌లో డ్రగ్స్ ముఠా గుట్టురట్టు
- ఎస్‌వోటీ, పోలీసుల సంయుక్త దాడులు
- డ్రగ్స్ విక్రయిస్తున్న ఐదుగురు అరెస్ట్
- ఇద్దరు నిందితులు పరారీలో
- భారీగా ఎండీఎంఏ డ్రగ్స్ స్వాధీనం
- నిషిద్ధ ఇంజెక్షన్లు, టాబ్లెట్లు సీజ్

ఆటో డ్రైవర్ ద్వారా డ్రగ్స్ డెలివరీ

05

# ఎక్కడ ‘సర్’.. మీ చిరునామా?

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** గ్రేటర్‌లో కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్ఓలు) తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేయడం మొదలుకుని వాటిని తిరిగి సేకరించడం, ఆన్‌లైన్‌లో నమోదు చేయడం వరకు అన్నింటా సతమతవంవుతున్నారు. ఓటర్ల చిరునామాలు దొరకక, స్థానికంగా సహకారం లభించక పరేషాన్ అవుతున్నారు. దీంతో పాటు బీఎల్ఓలకు సాయంగా ఉండేందుకు నియమించిన వారిలో సగం మంది విధులు హాజరుకాకపోవడంతో బీఎల్ఓలు క్షేత్ర స్థాయిలో నిర్ణయించిన లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేయలేకపోతున్నారు.

**ప్రహసనంగా ప్రక్రియ**

మహానగరంలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ బీఎల్ఓలకు ప్రహసనంగా మారింది. ఎన్యుమరేషన్ ఫారం ఇచ్చేందుకు వెళ్తున్న ఒక్కో బీఎల్ఓకు ఒక్కో విధమైన అనుభవం ఎదురవుతోంది. తమకిచ్చిన కిట్‌తో పాటు ఎన్యూమరేషన్ పత్రాల కట్టలను మోసుకుని ఇంటింటికీ తిరగలేకపోతున్నారు. ఒక్కొక్కరు దాదాపు 10 నుంచి 15 కిలోల బరువు మోసుకుంటూ నడుస్తుండడంతో నీరసించి పోతున్నారు. కాగా, మూసారాంబాగ్ డివిజన్‌లోని పోలింగ్ బూత్ నంబర్ 242కు చెందిన బీఎల్ఓ జె.నవీన్‌కుమార్ దాదాపు 10 కిలోలకు పైగా బ్యాగ్‌ను మోసుకుంటూ ఓటర్ల ఇంటికి వెళ్తే అక్కడి ఓటర్లు సరైన విధంగా స్పందించడం లేదని ఆయన వాపోయారు.

**2002 ఓటు వివరాలే ప్రధాన సమస్య**

ముఖ్యంగా 2002 నాటి ఓటరు వివరాలు, చిరునామాల మార్పులు, ప్రజల సహకారం లేకపోవడం వల్ల ప్రక్రియ నత్తనడకన సాగుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఎన్యుమరేషన్ ఫారంలో 2002లో ఓటు ఎక్కడ నమోదైందనే వివరాలు తప్పనిసరిగా ఇవ్వాల్సి ఉండడంతో దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలా మందికి అప్పటి ఓటరు వివరాలు గుర్తు లేకపోవడం, ఏ నియోజకవర్గంలో ఓటు ఉందో తెలియకపోవడం వల్ల ఫారాలు పూర్తి చేయలేకపోతున్నారు.

**బీఎల్ఓల వద్దకు క్యూ**

ఫారాలు ఎలా నింపాలో తెలియక చాలా మంది నేరుగా బీఎల్ఓల వద్దకు వచ్చి సాయం కోరుతున్నారు. ఈ క్రమంలో వారికి ఒక్కో ఫారం నింపేందుకు సమయం పడుతుండటంతో ఇతర పనులు కూడా ఆలస్యమవుతున్నాయి. చివరి రోజుల్లో అన్ని ఫారాలు ఒకేసారి వస్తే వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయడం కష్టతరమవుతోందని పలువురు బీఎల్ఓలు ఆందోళన చెందుతున్నారు. ఈనెల 15లోపు ఫారాలు తిరిగి ఇస్తే నమోదు ప్రక్రియ సులభంగా పూర్తవుతుందని పేర్కొంటున్నారు. గతంలో నమోదైన చిరునామాల్లో ప్రస్తుతం చాలామంది నివసించడం లేదు. ముఖ్యంగా ఉద్యోగాలు, ఇతర కారణాలతో వేలాది మంది ప్రాంతాలు మార్చేశారు. ఇళ్లకు వెళ్లిన బీఎల్ఓలకు ‘మేము ఇక్కడ ఉండడం లేదు’ అనే సమాధానాలే ఎక్కువగా వినిపిస్తున్నాయి. దీంతో అనేక ఫారాలు పెండింగ్‌లోనే ఉన్నాయి.

**కాటేదాన్‌లో భారీ మార్పులు**

కాటేదాన్ పారిశ్రామిక ప్రాంతంలోని ఫ్యాక్టరీల్లో గతంలో ఒక్కో పరిశ్రమలో 40 నుంచి 50 మంది కార్మికుల వరకు ఓటర్లు నమోదయ్యారు. ప్రస్తుతం ఆ కార్మికుల్లో చాలామంది ఇతర ప్రాంతాలకు వెళ్లిపోవడంతో వారి జాడ కనిపించడం లేదు. ఫలితంగా ఆ ఓట్ల ధ్రువీకరణ బీఎల్ఓలకు పెద్ద సవాల్‌గా మారింది..

**సహకరించని ఓటర్లు!**

పంపిణీ చేసిన ఫారాలు తిరిగి తీసుకురావడానికి వెళ్లిన బీఎల్ఓలకు కొందరు ఓటర్లు సహకరించడం లేదని వాదనలు వినిపిస్తున్నాయి. 2002లో ఎక్కడ ఓటు వేసామో గుర్తు లేదు... ఫారం తీసుకొచ్చారు కదా, మీరే నింపుకోండి.. అంటూ దురుసుగా మాట్లాడుతున్న సందర్భాలు కూడా ఎదురవుతున్నాయని పలువురు చెబుతున్నారు. కాగా, శాస్త్రిపురం, సులేమాన్‌నగర్ డివిజన్లు మినహా చాలా ప్రాంతాల్లో బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏ) ఆశించిన స్థాయిలో సహకరించడం లేదని బీఎల్ఓలు పేర్కొంటున్నారు. చాలామంది ఫొటోలు తీసుకుని వెళ్లిపోతున్నారే తప్ప, ఫారాల పరిశీలన లేదా ఓటర్లకు అవగాహన కల్పించడంలో చురుకుగా పాల్గొనడం లేదని అంటున్నారు.

**ఇతర శాఖల సిబ్బందిపై అదనపు భారం**

ఆశా వర్కర్లకు బీఎల్ఓ బాధ్యతలు అప్పగించడంతో వారు ఆస్పత్రి విధులతో పాటు ఓటరు నమోదు పనులు కూడా నిర్వహించాల్సి వస్తోంది. అలాగే మలేరియా విభాగం, ఇతర శాఖల సిబ్బందికి కూడా బీఎల్ఓ డ్యూటీలు ఇవ్వడంతో ఎన్నికల ప్రక్రియపై పూర్తి అవగాహన లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇదిలా ఉండగా, రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఇప్పటి వరకు సుమారు 30 వేల ఎన్యుమరేషన్ ఫారాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన ఫారాలను కూడా గడువులోపు పూర్తి చేయడానికి చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

**గుర్తింపు లేదంటున్న బీఎల్ఓలు**

ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇంటింటికీ తిరుగుతూ, ప్రజలకు వివరాలు చెప్పి, ఫారాలు నింపించి, ఆన్‌లైన్ నమోదు చేస్తూ తీవ్ర శ్రమిస్తున్నప్పటికీ తమ కష్టానికి తగిన గుర్తింపు లేదా ప్రతిఫలం లేదని బీఎల్ఓలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



## 80 బ్లాక్ స్పాట్స్ గుర్తింపు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ మహానగరం చుట్టూ ఉన్న నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్డు పై ప్రజా భద్రతను మెరుగుపరచడం తో పాటు రోడ్డు ప్రమాదాలను పూర్తిగా అరికట్టడమే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఇందులో భాగంగా శుక్రవారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ స్టేట్ పోలీస్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ లో అన్ని ప్రభుత్వ విభాగాల ఉన్నతాధికారులతో ఒక కీలక సమన్వయ సమావేశం జరిగింది. ఈ భేటీలో హెచ్ఎండీఏ, ఎన్‌హెచ్ఏఐ, జీహెచ్ఎంసీ, హెచ్‌జీసీఎల్, ఐఆర్బీ ఇన్‌ఫ్రా ప్రతినిధులతో పాటు హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. గత మే నెలలో జరిగిన సమావేశంలో చర్చించిన అంశాల పురోగతిపై సమీక్షించడం తో పాటు, ఓఆర్ఆర్ పై తరచుగా ప్రమాదాలు జరిగే అవకాశమున్న 80 అత్యంత ప్రమాదకరమైన ప్రాంతాలను అధికారులు గుర్తించినట్లు వివరించారు. ఈ ప్రాంతాల్లో ఇప్పటికే ఎన్‌ఫోర్స్‌మెంట్ పటిష్టం చేసినట్లు వెల్లడించారు. రహదారిపై భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు అత్యాధునిక ‘ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ఎలక్ట్రానిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిస్టమ్’ను అమల్లోకి తీసుకురావాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఈ ఏఐ సాంకేతికత ద్వారా అతివేగం, లైన్ డిసిప్లిన్ తప్పడం, రాంగ్ రూట్ డ్రైవింగ్ వంటి వివిధ రకాల ట్రాఫిక్ ఉల్లంఘనలను సులభంగా గుర్తించి తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చు. దీనివల్ల పదే పదే ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వాహనదారుల ధోరణికి అడ్డుకట్ట వేయవచ్చని అధికారులు వెల్లడించారు. భవిష్యత్తులో ఓఆర్ఆర్ ప్రయాణాన్ని మరింత సురక్షితంగా మార్చేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఈ భేటీలో తీర్మానించారు.

## ఆల్కహాల్ సిరప్ నియంత్రణ

**న్యూ ఢిల్లీ :** దేశంలో ఆల్కహాల్ ఆధారిత ఔషధాల నియంత్రణను మరింత పటిష్టం చేసేందుకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ నిబంధనలను మరింత కఠినతరం చేసింది. 12 శాతం కంటే ఎక్కువ ఇథైల్ ఆల్కహాల్ కలిగిన ఔషధాలను లైసెన్స్ లేకుండా విక్రయించడానికి వీల్లేదని స్పష్టం చేసింది. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఉంటేనే ఈ మందులను విక్రయించాలని పేర్కొంది. ఈ మేరకు ‘డ్రగ్స్ రూల్స్, 2026’ను ప్రభుత్వం నోటిఫై చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీని ప్రకారం 12 శాతం కంటే ఎక్కువ ఇథైల్ ఆల్కహాల్ కలిగి 30 మిల్లీలీటర్ల కంటే పెద్ద సీసాల్లో విక్రయించే సిరప్‌లు/టానిక్‌లను షెడ్యూల్ H1 పరిధిలోకి తీసుకొచ్చినట్లు పేర్కొంది.

**మత్తు కోసం దుర్వినియోగంతో:**

కొన్ని రకాల దగ్గు సిరప్‌లు, టానిక్‌లలో ఔషధాల స్థిరత్వం కోసం, క్రియాశీల పదార్థాలను కరిగించడం కోసం ఇథైల్ ఆల్కహాల్‌ను ఎక్కువ శాతం ఉపయోగిస్తారు. అయితే ఈ ఔషధాలు సులభంగా లభిస్తుండటంతో వీటిని చికిత్స కోసం కాకుండా మత్తు కోసం దుర్వినియోగం చేస్తున్నారు. ఈ విషయంలో పలు రాష్ట్రాల నుంచి ఆందోళనలు వ్యక్తం అయ్యాయి. ఈ నేపథ్యంలో డ్రగ్స్ కన్సల్టేటివ్ కమిటీ , డ్రగ్స్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డు ల సిఫార్సుల మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం వల్ల అవసరమైన రోగులకు ఈ ఔషధాలు ఎప్పటిలాగే అందుబాటులో ఉంటాయి. కానీ రిజిస్టర్డ్ డాక్టర్ ఇచ్చిన చెల్లుబాటు అయ్యే ప్రిస్క్రిప్షన్ ఉంటేనే ఈ మందులు విక్రయించనున్నారు. అలాగే వీటి విక్రయానికు సంబంధించిన వివరాలను ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. నియంత్రణ అధికారుల తనిఖీల కోసం ఆ ప్రిస్క్రిప్షన్లు, విక్రయ రికార్డులను కనీసం మూడేళ్ల పాటు భద్రపరచాల్సి ఉంటుంది.

## జాతీయ స్థాయిలో సింగరేణికి మరో ఘనత

**కొత్తగూడెం సింగరేణి,ఫ్లాష్ ఇండియా :** కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ స్థాయి ఉత్తమ గనుల ఎంపికలో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్) మరో ప్రతిష్ఠాత్మక ఘనతను సొంతం చేసుకుంది. 2024–25 సంవత్సరానికి గాను సంస్థకు చెందిన ఐదు గనులు అత్యుత్తమ 5-స్టార్ రేటింగ్ సాధించి దేశవ్యాప్తంగా ఉత్తమ గనుల జాబితాలో చోటు దక్కించుకున్నాయి. ఈసారి శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే న్యూటెక్, ఆర్కే-6, సత్తుపల్లి ఏరియాలోని జేవీఆర్ ఓసీ-2, బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ ఓపెన్‌కాస్ట్, రామగుండం-3 ఏరియాలోని ఆర్జీ ఓసీ-1 గనులు 5-స్టార్ రేటింగ్ సాధించాయి. దేశవ్యాప్తంగా 382 గనులు దరఖాస్తు చేయగా, కేవలం 50 గనులు మాత్రమే ఈ అత్యున్నత గుర్తింపుకు ఎంపికయ్యాయి. వాటిలో ఐదు గనులు సింగరేణివే కావడం విశేషం. గత ఏడాది నాలుగు గనులు మాత్రమే ఈ గుర్తింపు పొందగా, ఈసారి ఐదు గనులు ఎంపిక కావడం సింగరేణి చరిత్రలోనే అత్యధికంగా నిలిచింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు సింగరేణి యాజమాన్యం, అధికారులు, కార్మికులు, సిబ్బందిని అభినందించారు. రక్షణ ప్రమాణాలు, కార్మిక సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ, గ్రామీణాభివృద్ధి వంటి అంశాల్లో ఈ గనులు ఆదర్శంగా నిలిచాయని పేర్కొంటూ, ఇతర గనులు కూడా వీటిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కేంద్ర బొగ్గు శాఖ అనుబంధ సంస్థ కోల్ కంట్రోలర్ ఆర్గనైజేషన్ (సీసీఓ) ఆధ్వర్యంలో నిర్వహించే ఈ రేటింగ్ ప్రక్రియలో గనుల పనితీరు, సాంకేతికత, భద్రత, పర్యావరణ పరిరక్షణ, కార్మిక సంక్షేమం, సామాజిక బాధ్యత తదితర ఏడు విభాగాల్లోని 50 ప్రమాణాల ఆధారంగా మూల్యాంకనం నిర్వహిస్తారు. నిపుణుల బృందం ప్రత్యక్షంగా గనులను పరిశీలించిన అనంతరం 90 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించిన గనులకు 5-స్టార్ రేటింగ్ ప్రకటిస్తారు. ఇదిలా ఉండగా, ఈసారి సింగరేణికి చెందిన మరో 17 గనులు 4-స్టార్ రేటింగ్ సాధించాయి. స్వల్ప మార్కుల తేడాతో అవి 5-స్టార్ రేటింగ్‌ను కోల్పోయినట్లు అధికారులు తెలిపారు. సింగరేణిలో అమలవుతున్న రక్షణ ప్రమాణాలు, పర్యావరణహిత చర్యలు, కార్మిక సంక్షేమ కార్యక్రమాలు, సమర్థవంతమైన గని నిర్వహణకు ఈ గుర్తింపులు నిదర్శనమని సంస్థ అధికారులు పేర్కొన్నారు.

# ఈ మార్కెట్ మత్స్యకారుల అభివృద్ధికి మైలురాయి





**తుర్కయంజాల్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ మత్స్యకారులకు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో కొత్త అవకాశాలు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. శుక్రవారం ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని కోహెడలో 13 ఎకరాల లో రూ.47.03 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఎగుమతి ఆధారిత హోల్ సేల్ చేపల మార్కెట్ ను మంత్రి వాకిటి శ్రీహరి భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. దేశంలోనే సముద్రతీర ప్రాంతం కాకుండా అంతర్గత రాష్ట్రంలో ఏర్పాటు కానున్న తొలి ఆధునిక మంచినీటి చేపల ఎగుమతి కేంద్రంగా కోహెడ మార్కెట్ నిలవనుందని తెలిపారు. తెలంగాణలో ఉత్పత్తి అయ్యే చేపలకు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లను విస్తరించడంలో ఈ కేంద్రం కీలకంగా మారుతుందని పేర్కొన్నారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులతో ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ మార్కెట్‌లో ఆధునిక శీతల గిడ్డంగులు, శుద్ధి యూనిట్లు, ప్యాకేజింగ్ కేంద్రాలు, శిక్షణా కేంద్రం, కస్టమ్స్ సదుపాయాలు, భారీ హోల్‌సేల్ మార్కెట్ వంటి అన్ని వసతులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సుమారు రెండు వేల మంది వ్యాపారులు ఇక్కడ వ్యాపారం నిర్వహించే అవకాశం ఉండగా, ఐదు వేల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభిస్తుందని తెలిపారు.

**ఈ మార్కెట్ మత్స్యకారుల అభివృద్ధికి మైలురాయి**

అనంతరం భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ఈ మార్కెట్ మత్స్యకారుల అభివృద్ధికి మైలురాయిగా నిలుస్తుందని, బ్లూ రివల్యూషన్ లక్ష్యాల సాధనలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. మత్స్యకారులకు గిట్టుబాటు ధరలు, ఆధునిక మార్కెటింగ్ సౌకర్యాలు, ఎగుమతి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ, కోహెడలో నిర్మిస్తున్న ఈ మార్కెట్ తెలంగాణ మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. విజయవాడ జాతీయ రహదారి, నాగార్జునసాగర్ రహదారి, ఔటర్ రింగ్ రోడ్డుకు సమీపంలో ఉన్న ఈ ప్రాంతంలో అంతర్జాతీయ ప్రమాణాలతో మార్కెట్ నిర్మాణం చేపట్టడం వల్ల మత్స్యకారులు, ముదిరాజ్, బెస్త వర్గాలకు విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు కోసం 13 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించినట్లు తెలిపారు. అదనంగా మరో రూ.50 కోట్లు మంజూరు చేసి మొత్తం రూ.100 కోట్లతో అత్యాధునిక సౌకర్యాలు కల్పించాలని మంత్రి వాకిటి శ్రీహరిని కోరారు. ఈ కార్యక్రమంలో ఫిషరీస్ డైరెక్టర్ నిఖిల, రంగారెడ్డి జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు దూస వెంకటేష్, ఫిషరీస్ అదనపు డైరెక్టర్ మురళీకృష్ణ, జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షురాలు కొత్త కురుమ మంగమ్మ, టి పి సి సి కార్యదర్శి కొత్త కురుమ శివకుమార్, ఫ్రూట్ మార్కెట్ చైర్మన్ చిలుక మధుసూధన్ రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కర చారి,ఎంఆర్ఓ సుదర్శన్ రెడ్డి, ఆదిభట్ల సర్కిల్ డీ సీ సత్యనారాయణ రెడ్డి, తొర్రూరు డివిజన్ అధ్యక్షులు కోశిక ఐలయ్య, తుర్కయంజాల్ డివిజన్ అధ్యక్షులు ఓర్సు శ్రీనివాస్, నాయకులు వంగేటి గోపాల్ రెడ్డి, మర్రి మహేందర్ రెడ్డి, కుంట గోపాల్ రెడ్డి, మత్స్యకారులు, అధికారులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు సమగ్ర చర్యలు తీసుకోవాలి

**వాంకిడి,ఫ్లాష్ ఇండియా :** రోడ్డు ప్రమాదాల నివారణకు సమగ్ర చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ నితిక పంత్ జాతీయ రహదారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని బంబార, ఖమాన, వాంకిడి ఎక్స్‌రోడ్డు ప్రాంతాల్లోని ప్రమాదకర ప్రాంతాలను (బ్లాక్ స్పాట్స్) నేషనల్ హైవే ప్రాజెక్టు డైరెక్టర్ అజయ్‌తో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ప్రాంతాల్లో స్పష్టమైన సైన్‌బోర్డులు, సోలార్ లైటింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రమాదాలకు ఎక్కువగా అవకాశం ఉన్న ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, స్పీడ్ లిమిట్ సూచికలు, స్పీడ్ బ్రేకర్లు, రిఫ్లెక్టివ్ మార్కింగ్‌లు, అవసరమైన చోట రోడ్ బంప్స్ ఏర్పాటు చేయడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. వాహనదారులు ముందుగానే అప్రమత్తమై జాగ్రత్తగా ప్రయాణించేలా రహదారి భద్రతా చర్యలను పటిష్టం చేయాలని సూచించారు. జాతీయ రహదారి అధికారులు, పోలీసు శాఖ పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రమాదాల నివారణకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో డీఎస్పీ అశోక్, సీఐ వేణుగోపాల్, ఇన్‌స్పెక్టర్ రవీందర్, ఎస్ఐ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



## చాదర్‌ఘాట్‌లో డెకరేషన్ గోదాంలో భారీ అగ్నిప్రమాదం

**చంపాపేట్,ఫ్లాష్ ఇండియా :** నగరంలోని చాదర్‌ఘాట్‌లో మూసీ నది సమీపంలో ఉన్న డెకరేషన్ వస్తువుల గోదాంలో శుక్రవారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఒక్కసారిగా చెలరేగిన మంటలు క్షణాల్లోనే గోదాం అంతటా వ్యాపించి భారీ ఎత్తున అగ్నిజ్వాలలు ఎగసిపడ్డాయి. దట్టమైన నల్ల పొగ పరిసర ప్రాంతాలను కమ్మేయడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. గోదాంలో ప్లాస్టిక్ వస్తువులు, థర్మాకోల్, అలంకరణ బట్టలు తదితర అత్యంత సులభంగా మంటలు అంటుకునే సామగ్రి పెద్ద ఎత్తున నిల్వ ఉండటంతో అగ్ని వేగంగా వ్యాపించింది. దీంతో గోదాంలోని డెకరేషన్ సామగ్రి అధిక భాగం మంటల్లో దగ్ధమైనట్లు సమాచారం. స్థానికులు వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించడంతో ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా శ్రమించారు. సమీప ప్రాంతాలకు మంటలు వ్యాపించకుండా అప్రమత్త చర్యలు చేపట్టారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని ప్రాథమిక సమాచారం. అయితే గోదాంలో నిల్వ ఉన్న విలువైన డెకరేషన్ సామగ్రి పూర్తిగా దగ్ధమై భారీ ఆస్తి నష్టం సంభవించినట్లు తెలుస్తోంది.

అగ్నిప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. షార్ట్‌సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తవంవుతున్నప్పటికీ, అధికారికంగా ఇంకా నిర్ధారణ కాలేదు. నష్టానికి సంబంధించిన పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడికానున్నాయి.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# పోరాటం చేస్తే మెడికల్ బోర్డు పెట్టారు

**మణుగూరు,ఫ్లాష్ ఇండియా :** డిపెండెంట్ ఉద్యోగాలను కాంగ్రెస్ ప్రభుత్వం డోలాయమానంలో పడేసిందని తెలంగాణ రక్షణ సేన గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఆమె శుక్రవారం సింగరేణి సంస్థ మణుగూరు ఏరియా పీకేఓ సీటు గాని నందు హెచ్ ఎం ఎస్ యూనియన్ నాయకులతో కలిసి బాయ్ బాట కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. టీబీజీకేఎస్‌లో ఉన్నప్పుడు ఎన్ మైనస్ వన్ అనే దానిపై నాకు అవగాహన లేదని, నన్ను కన్విన్స్ చేసి తీసుకువచ్చారని, పీహెచ్డీ 50 శాతం కోతతో తీసుకు రావడం జరిగిందన్నారు. కార్మికులందరూ తన క్షమించాలని నా తప్పును సరదిద్దుకొని మీ పక్షాన పోరాటం చేస్తానన్నారు. సింగరేణి సంస్థలు మూడువేల ఖాళీలు ఉన్నాయని, డిపెండెంట్ పెట్టుకున్న వారిని ప్రాసెస్ చేస్తే ఖాళీలు భర్తీ అవుతాయి అన్నారు. ప్రభుత్వాన్ని నిలదీసి 30 నెలలు అవుతుందని అప్పుడు మెడికల్ బోర్డు పెట్టి 54 మందిని ప్రాసెస్ చేసి కేవలం నలుగురిని ఎంపిక చేసి 50 మందిని వదిలి పెట్టారన్నారు. 2000 అప్లికేషన్స్, అన్ఫిట్ అయిన 700 మందికి ఎంప్లాయ్మెంట్ ఇవ్వకపోవడం దారుణం అన్నారు. రిటైర్మెంట్ కి దగ్గర ఉన్న వారు మాకు సమయం లేదని పిల్లలకు ఉద్యోగాలు రావని ఆవేదనతో ఉన్నారన్నారు.

**ధర్నాలు చేసినప్పుడే చెప్తామంటే కరెక్ట్ పద్ధతి కాదు..**

ప్రతి నెల రెండుసార్లు మెడికల్ బోర్డు పెట్టాలని లేని పక్షంలో ఈనెల 20వ తేదీ నుండి నిరవధిక సమ్మె గాంధీ మార్గంలో చేస్తామని చెప్పడం జరిగిందన్నారు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఏఐటీయూసీ యూనియన్ నుంచి పలాన తారీకు నుండి మెడికల్ బోర్డు అని, ఐ ఎన్ టి యు సి యూనియన్ నుండి పలాన తారీకు నుండి మెడికల్ బోర్డు అని మెసేజ్ లు ఇప్పిస్తున్నారని, ఇలాంటి లీక్ వీరుల ప్రభుత్వం మనకు వద్దన్నారు. ఏదైనా భాజప్తిగా ప్రకటన ఇవ్వాలన్నారు. ధర్నాలు చేసినప్పుడే చెప్తామంటే కరెక్ట్ పద్ధతి కాదన్నారు. ఎవరైతే డిపెండెంట్ ఏ తారీఖున అప్లికేషన్ పెట్టారో అదే తేదీని ప్రాతిపదికన తీసుకోవాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో 3000 మందికి అలియాస్ పేర్లు ఉన్నాయని, పదవ తరగతి పాస్ కాలేదని 150 మందిపై కార్మికులపై విజిలెన్స్ కేసులు పెట్టారని, పదవ తరగతి పాస్ కావడానికి సింగరేణి ఉద్యోగానికి సంబంధం ఏమిటి అని ప్రశ్నించారు. 17 గనులు డిస్టర్బ్ అవుతున్నాయని, వాటిని కేంద్ర ప్రభుత్వం మనకే అలగేట్ చేయాలన్నారు.

**ముందస్తుగానే భారీ పోలీస్ బందోబస్తు పెట్టి...**

ఐటీ మీద పర్చ్‌ని రిమూవ్ చేయాలని పక్షంలో ఢిల్లీలో పోరాటం చేస్తామన్నారు. అండర్ గ్రౌండ్ మైన్స్ అన్ని ఓపెన్ చేసి సింగరేణి సంస్థను కాపాడాలన్నారు. ప్రభుత్వం సింగరేణి సంస్థకి 50 వేల కోట్ల బాకీ ఉందని, అందుకే యాజమాన్యం కార్మికులు ఏమి అడిగినా పట్టించుకోవడం లేదన్నారు. కార్మికులకు సేఫ్టీ ఎంతో ముఖ్యమని నాణ్యతలేని కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు సేఫ్టీ కోసం పనిచేయాలన్నారు. బయ్యారం ఉక్కు గదిని సింగరేణి కేటాయించాలని, దీనివల్ల సింగరేణి బాగుంటుందని ఉద్యోగ అవకాశాలు కూడా వస్తాయన్నారు. అదేవిధంగా సింగరేణి సంస్థకి హౌసింగ్ బోర్డ్ పెట్టి రిటైర్డ్ అయిన కార్మికులకు జిల్లా కేంద్రంలో ప్లాట్స్ ఇవ్వాలని కోరారు. అసలు పోలీసులకు సింగరేణి లోకి వచ్చే అధికారం లేదని, మా పర్యటన ఉందని తెలిసి ముందస్తుగానే భారీ పోలీస్ బందోబస్తు పెట్టి అడ్డుకునే ప్రయత్నం చేశారన్నారు. అయినా భయపడకుండా కార్మిక బలంతో లోపలికి రావడం జరిగింది అన్నారు. టిఆర్ఎస్, హెచ్ఎంఎస్ యూనియన్‌లో సింగరేణి కార్మికుల కోసం, వారి హక్కుల కోసం నిత్యం పోరాటం చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో రియాజ్ అహ్మద్, రమేష్, శ్రీలత, సారయ్య, అనిల్ రెడ్డి, వీరన్న, జనార్ధన్, పవన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# నాకు తెలంగాణే ఫస్ట్..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ప్రజల విషయానికొస్తే.. తనకు తెలంగాణే ఫస్ట్ అని, ఆ తర్వాతే పార్టీ, వ్యక్తిగతమని.. తాను ఎవరో పలికిస్తే పలికే వ్యక్తిని కాదని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇవాళ నగరంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎగువ రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురిసి తెలంగాణలోని ప్రాజెక్టుల్లోకి నీళ్లు వస్తున్నా.. ప్రభుత్వం మోటార్లు ఆన్ చేయకుండా అన్నదాతలను కష్టాల పాలు చేయడం భావ్యం కాదన్నారు. వర్షాకాలం పంటలకు నీళ్లు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన వ్యాఖ్యానించారు. ఎస్ఆర్ఎస్పీ కాల్వల కింద.. బోర్లు, బావులు లేకుండా పూర్తి స్థాయిలో వ్యవసాయం చేయడం సాధ్యం కాదన్నారు. ఇది నీళ్లు, సాగుపై అవగాహన ఉన్నవారికి మాత్రమే తెలుస్తుందని ధ్వజమెత్తారు. తాను హుజూరాబాద్ ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో.. ఎస్ఆర్ఎస్పీ నీళ్లు వచ్చినప్పుడు తూములు ఎత్తించి తమ నియోజకవర్గ రైతులకు హీరో అయ్యానని, ఒకవేళ అదే నీళ్లు వరంగల్ వాసులకు చేరకపోతే తనపై చిందులు తొక్కేవారని గుర్తు చేసుకున్నారు.

**అంతకు ముందే జలయజ్ఞం..**

నీళ్ల కోసమే, నిధుల కోసమే, ఆత్మగౌరవం కోసమే ఉద్యమించిన చరిత్ర తెలంగాణదని.. ఇవాళ రాజకీయాలు, సిద్ధాంతాలు వేరై ఉండొచ్చు కానీ, మూలాలను మరిచిపోయినవాడు మనిషే కాదంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. చాలా మంది చరిత్రను మరిచిపోయారని, కాళేశ్వరం కంటే ముందే వైఎస్సార్ హయాంలో జలయజ్ఞం ప్రారంభమైందని గుర్తు చేశారు. జలయజ్ఞంలో భాగంగా ఆయన తమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత నీళ్లను తీసుకురావాలని ప్లాన్ చేశారని పేర్కొన్నారు. తాను ఎమ్మెల్యే అయ్యాకే 24 టీఎంసీల సామర్థ్యంతో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు శంకుస్థాపన జరిగిందని గుర్తు చేశారు. అప్పుడే మిడ్ మానేరు డ్యామ్ నిర్మాణం కూడా ప్రారంభమైందని తెలిపారు. ఇవాళ శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు, కొండపోచమ్మ ప్రాజెక్టు, మల్లన్న సాగర్.. ఇలా కాళేశ్వరం నీళ్లు చేవెళ్ల వరకు రావాలని మొదట ఆలోచన చేసింది కాంగ్రెస్ పార్టీనే అనే విషయాన్ని మరిచిపోవద్దన్నారు.

**కాళేశ్వరంతోనే సంపూర్ణంగా రెండు పంటలు..**

స్వరాష్ట్రం వచ్చాక రాష్ట్రానికి కడుపునిండా నీళ్లు ఉండాలనే ఉద్దేశంతో ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం మేడిగడ్డ ప్రాజెక్టు నుంచి అన్నారం, అక్కడి నుంచి సుందిళ్ల, ఆ తర్వాత ఎల్లంపల్లికి నీళ్లు తరలించేలా ప్రాజెక్టులను అందుబాటులోకి తెచ్చిందని అన్నారు. ఆ ప్రాజెక్టుల ద్వారా వచ్చిన 29 టీఎంసీల నీళ్లే నేడు మిడ్ మానేరు ప్రాజెక్టులో ఉన్నాయని తెలిపారు. రైల్వే జంక్షన్‌కు కాజీపేట ఎలాంటిదో.. ఇవాళ ఉత్తర తెలంగాణకు నీళ్ల అడ్డా మిడ్ మానేరు అని ఈటల రాజేందర్ పేర్కొన్నారు. పోచంపాడు ప్రాజెక్టులో 90 టీఎంసీలు, ఎల్ఎండీలో 24 టీఎంసీల కెపాసిటీ ఉన్నప్పటికీ, గతంలో హుజూరాబాద్ నియోజకవర్గంలో ఒక్క పంటకు కూడా నీళ్లు అందేవి కావని ఈటల రాజేందర్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు లింక్ అయ్యాక.. మిడ్ మానేరులోని 25 టీఎంసీల నీటితో పాటు పోచంపాడు ప్రాజెక్టు నీటిని కలిపి హుజూరాబాద్ నియోజకవర్గంతో పాటు కరీంనగర్ జిల్లా, వరంగల్ జిల్లా, నల్గొండ జిల్లాలోని కొంత భాగానికి సంపూర్ణంగా రెండు పంటలు పండుతున్న మాట వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కమీషన్లు, కాంట్రాక్టులు, డిజైన్ల మార్పుల గురించి తాను మాట్లాడటం లేదని.. కానీ, అసలు ఆ ప్రాజెక్టు కట్టడమే తప్పు అని కాంగ్రెస్ నేతలు మాట్లాడుతున్న మాటలు దుర్మార్గమని అన్నారు. కాళేశ్వరం పరిధిలోని ప్రాజెక్టును రిపేర్ చేయకుండా ఎందుకు జాప్యం చేస్తున్నారని, భయంకరమైన కరువు వస్తుందని తెలిసి కూడా ఎందుకు ఇలా వ్యవహరిస్తున్నారని ప్రభుత్వంపై ఈటల రాజేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# 2029 జూన్ లోనే అసెంబ్లీ ఎన్నికలు..

(మొదటి పేజీ తరువాయి)



వచ్చే ఎన్నికల్లో పార్లమెంట్ సీట్లు 25, అసెంబ్లీ 182కు పెరుగుతాయన్నారు. 182 సీట్లలో 117 సీట్లు గెలిచి రెండో సారి ప్రజాపాలన రాబోతోందన్నారు. భద్రాచలం రాముడి మీద ఆన.. ఇది కాంగ్రెస్ కార్యకర్తల మాట.. ఇది రాసి పెట్టుకో కేసీఆర్ అని శపథం చేశారు. కేంద్రంలోని బీజేపీ తమ పంతం నెగ్గించుకునేందుకు ప్రతిపక్షాలను చీల్చుతోందని దుయ్యబట్టారు.

**బీజేపీతో హరీశ్ రావు మంతనాలు:**

బీజేపీలోకి వెళ్లేందుకు మంతనాలు జరుపుతున్నారో లేదో హరీశ్‌రావు చెప్పాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. నేను బీజేపీలోకి వెళ్లబోనని వారితో బీజేపీతో మంతనాలు జరపడం లేదని హరీశ్ రావు భద్రాచలం రాముడు, కేసీఆర్‌పై ఒట్టేసి చెప్పాలన్నారు. కాంగ్రెస్ సొంత సర్వేలో బీఆర్ఎస్ గెలవబోతోందని ఫలితం వచ్చిందని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై సీఎం ఫైర్ అయ్యారు. జూబ్లిహిల్స్ ఉప ఎన్నికల్లో ఇలాగే సర్వేల పేరుతో డబ్బా కొట్టుకున్నారు. కానీ ప్రజల తీర్పు మాకు అనుకూలంగా ఇచ్చారని, ఇప్పుడు మేము జరిపించిన సర్వేలో మాకు వ్యతిరేకంగా ఫలితాలు వచ్చాయని ప్రచారం చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎన్ని సీట్లు ఉంటాయో? ఏ రిజర్వేషన్లు ఉంటాయో తెలియకుండానే ఎవరైనా సర్వేలు చేయిస్తారా అని ప్రశ్నించారు.

**మీ రాజకీయాల కోసం గ్రామాలు మునగాలా?:**

కన్నెపల్లి పంప్ హౌస్‌లు ఓపెన్ చేయాలని బీఆర్ఎస్ నేతల మాటలపై సీఎం ఘాటుగా రియాక్ట్ అయ్యారు. కన్నెపల్లి పంప్‌లు ఆన్ చేస్తే భద్రాచలం రాముడి గుడి సహా 44 గ్రామాలు కొట్టుకుపోయే ప్రమాదం ఉందని మీ లుచ్చా రాజకీయాల కోసం భద్రాచలం రాముడు, గ్రామాలు మునగాలా అని ప్రశ్నించారు. కేసీఆర్ ఇంట్లో ఒకరంటే మరొకరికి పడదని ధ్వజమెత్తారు. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ వస్తే కరెంట్ ఉండదని దుర్మార్గులు విష ప్రచారం చేశారు. ఇవాళ నేను కల్వకుంట్లోళ్లను అడుగుతున్న ఉదయం, మధ్యాహ్నం, రాత్రి పూట ఎప్పుడైనా కరెంట్ వైర్‌ను పట్టుకో కాకిలా మాడి మసి అయిపోతారు. ఉచిత కరెంట్ కాంగ్రెస్ పేటెంట్ రైట్ అన్నారు.

**2023లో అద్భుతం జరిగింది:**

రాజకీయంగా పాలమూరు జిల్లా నాకు ప్రాణం అయితే నా రాజకీయ ఎదుగుదలలో ఖమ్మం జిల్లా గుండెకాయలా పని చేసిందని సీఎం చెప్పారు. తెలంగాణలో గత పదేళ్ల రాక్షస పాలన సాగిందన్నారు. 2023 జులైలో ఒక అద్భుతం జరిగిందని బీఆర్ఎస్‌ను కాదని పొంగులేటి కాంగ్రెస్‌లో చేరారన్నారు. ఆనాడు ఉప్పెనలా జనం కాంగ్రెస్ పార్టీలోకి వచ్చారు. కానీ బీఆర్ఎస్ డబ్బు మూటలను తట్టుకుని మీరు ఆ ఎన్నికల్లో గెలవలేరని నాతో మీడియా ప్రతినిధులు అన్నారు. కానీ 65 సీట్లు కాంగ్రెస్ గెలుస్తుందని చెప్పాం గెలిచి చూపించామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు గుండుసున్నా వస్తుందని చెప్పాం అదే జరిగిందన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో 2/3 మున్సిపాలిటీల్లో 80 శాతం గెలిచాం. మళ్లీ ఖమ్మంలో బీఆర్ఎస్ విషపు మొక్కను మొలకెత్తనివ్వం అని చాటి చెప్పేందుకు చీమలదండై, ఉప్పెనలా వచ్చిన ప్రజలను చూసి నా గుండె పులకరించిపోయిందన్నారు.

**30 నెలల్లో 1 లక్ష 70 వేల కోట్లు:**

ప్రజాప్రభుత్వంలో రామరాజ్యం తీసుకువస్తామని సీఎం చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం విషయంలో ఎవరికీ అన్యాయం జరగనివ్వం అన్నారు. నాడు వరి వేస్తే ఉరి అని కేసీఆర్ అంటే ఇవాళ మా ప్రభుత్వం వరి వేస్తే బోనస్ ఇస్తున్నామన్నారు. రైతులను రాజును చేయాలనే ఉద్దేశంతో రైతుభరోసా నిధులు విడుదల చేశామన్నారు. 9 రోజుల్లో చివరి విడత డబ్బులు రైతు ఖాతాలో వేశామన్నారు. ఈ 30 నెలల్లో రైతుల కోసం వివిధ కార్యక్రమాల కోసం 1 లక్ష 70 వేల కోట్లు ఖర్చు పెట్టామని ఇంత ఖర్చు చేసిన ప్రభుత్వం మన దేశంలో మరే రాష్ట్రంలో చేయలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖమ్మం జిల్లాలో మరోసారి రాజకీయ ప్రకంపనలు సృష్టించారు. చింతకాని మండలం జగన్నాథపురంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 'రైతు ఆశీర్వాద సభ'కు సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ వేదిక నుంచి వానాకాలం సీజన్కు సంబంధించిన రైతు భరోసా తుది విడత నిధులు రూ.1009 కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లోకి విడుదల చేశారు. ఈ నిధుల విడుదలతో ఇప్పటివరకు రాష్ట్రంలో మొత్తం రూ.8,759 కోట్ల పెట్టుబడి సాయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేసినట్లయింది. ఇప్పటిదాకా 74 లక్షల మంది రైతులకు చెందిన 1.45 కోట్ల ఎకరాల భూములకు విజయవంతంగా పెట్టుబడి సాయం అందించామని సీఎం ఈ సందర్భంగా ప్రకటించారు.

**నా రాజకీయ ఎదుగుదలకు ఖమ్మమే గుండెకాయ..**

సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లాపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. "నా రాజకీయ ఎదుగుదలలో ఖమ్మం జిల్లా ఒక గుండెకాయలాగా నిలిచింది. 2023 జులైలో ఇక్కడ ఒక అద్భుతం జరిగింది. నాటి బీఆర్ఎస్ అహంకార పాలనను కాదని పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. ఆనాడు ఉప్పెనలా జనం కాంగ్రెస్ వైపు వచ్చారు. సరిగ్గా 36 నెలల తర్వాత మళ్లీ అదే జులైలో ఇవాళ ప్రజాపాలనను ఆశీర్వదించడానికి రైతాంగం మళ్లీ ఉప్పెనలా తరలివచ్చింది" అని హర్షం వ్యక్తం చేశారు. "తెలంగాణలో బీఆర్ఎస్‌ను మళ్లీ మొలకెత్తనీయబోమని ఇక్కడి ప్రజలు ఒట్టు పెట్టారు. అందుకే ఆ పాపాల భైరవుడిని ఫాంహౌస్‌లో బంధించారు. ఎన్నికల సమయంలో కేసీఆర్ మాయమాటలు, మూటలతో వస్తున్నారని, వారిని ఎలా ఎదుర్కొంటావని కొందరు నన్ను అడిగారు. వాళ్లు ఎలా వచ్చినా కాంగ్రెస్ 65 సీట్లు గెలుస్తుందని ఆనాడే గంటాపథంగా చెప్పా. మేము అన్నట్టే ఎన్నికల్లో 64 సీట్లు సాధించాం. ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో మరో రెండు సీట్లు గెలిచి మా బలాన్ని నిరూపించుకున్నాం" అని గుర్తుచేశారు.

**భద్రాచలం రాముడిపై ఆన.. 2029లో 117 సీట్లతో మళ్లీ మనదే పీఠం!**

భవిష్యత్తు ఎన్నికలపై సీఎం రేవంత్ రెడ్డి భద్రాచలం రాముడి సాక్షిగా సంచలన ప్రతిన పూనారు. "2029 జూన్లో రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత రాష్ట్రంలో పార్లమెంట్ సీట్లు 25కు, అసెంబ్లీ సీట్లు 182కు పెరుగుతాయి. ఆ 182 స్థానాలలో కాంగ్రెస్ పార్టీ ఒంటరిగానే 117 సీట్లు గెలిచి, రెండోసారి సగర్వంగా ప్రజాపాలనను తీసుకొస్తుంది. భద్రాచలం రాముడి మీద ఆన వేసి చెబుతున్నా.. ఇది కేవలం నా మాట కాదు, ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పూనిన ప్రతిన" అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

**త్వరలో మరో 20 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు: పొంగులేటి**

పేదల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పేదలను ఆదుకునేందుకు పని చేస్తున్నామన్నారు. రైతులను అన్ని రకాలుగా ఆదుకుంటున్నామని చెప్పారు. ఖమ్మం జిల్లాలో జరిగిన రైతు ఆశీర్వాద సభలో మాట్లాడిన మంత్రి.. తొలి రెండేళ్లలో సుమారు 71 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని, త్వరలో మరో 20 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇవ్వబోతున్నామని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి కొట్టొచ్చినట్లు కనిపిస్తోందన్నారు. రాబోయే రెండేళ్లలో రాష్ట్రంలోని ప్రతి గజాన్ని సర్వే చేసి సాగులో ఉన్నా రైతులకు మ్యాప్ లతో సహా భూధార్ కార్డులను అందజేస్తామన్నారు. రైతులను రాజులను చేస్తామని చెప్పినట్లుగా ఆ ప్రయత్నం చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో వచ్చిన ప్రతి ఎలక్షన్‌లో ప్రజా ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదిస్తున్నారంటే అదే మా పని తీరుకు నిదర్శనం అన్నారు.

**విషం కక్కుతున్నారు:**

కడుపులో విషం పెట్టుకుని ప్రతిపక్షాలు విషం కక్కుతున్నాయన్నారు. ఇప్పటికే బీఆర్ఎస్‌కు ప్రజలు రెండు సార్లు ప్రజలు బుద్ధి చెప్పారని రాబోయే ఎన్నికల్లో మరోసారి వారికి భంగపాటు తప్పదన్నారు. రాష్ట్రంలో రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరైందన్నారు. ఆ తర్వాత మూడు, నాలుగో విడత కూడా ఇస్తామని అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడమే రేవంత్ రెడ్డి ప్రభుత్వం లక్ష్యం అన్నారు.



**వడ్డీ లేని రుణాలపై డిప్యూటీ సీఎం భట్టి కీలక ప్రకటన**

ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురంలో మంత్రి తుమ్మల నాగేశ్వర రావుతో కలిసి మెగా రైతు మేళాను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని సాగునీరు, ధాన్యం కొనుగోలు, వ్యవసాయ యాంత్రీకరణ, మార్క్‌ఫెడ్ కార్యకలాపాల బలోపేతానికి ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తోందని పేర్కొన్నారు. రైతుల ఆదాయం పెంచి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. రైతు భరోసా కింద కేవలం తొమ్మిది రోజుల్లోనే రూ.9,000 కోట్లను రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేసిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. ధాన్యం, మొక్కజొన్న, జొన్నల కొనుగోలు ద్వారా రైతులను అన్ని విధాలా ఆదుకున్నామని తెలిపారు. మాటలతో కాదు.. చేతలతో రైతు సంక్షేమాన్ని నిరూపిస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని పేర్కొన్నారు. దశాబ్దాల క్రితం కాంగ్రెస్ నిర్మించిన సాగునీటి ప్రాజెక్టులు నేటికీ రైతులకు నీరందిస్తున్నాయని, రైతుల సంక్షేమానికి శాశ్వత పరిష్కారాలే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. రైతే దేశానికి వెన్నెముక అని, ఆ వెన్నెముకను మరింత బలోపేతం చేయడానికే కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. 'మహిళల్ని ఆర్థికంగా అభివృద్ధి పథంలో నడిపించడమే ప్రభుత్వ లక్ష్యం. 9 రోజుల్లో రూ.9వేల కోట్లు రైతుల ఖాతాలో వేశాం. గత ప్రభుత్వం రైతుబంధు కింద ఎకరాకు రూ.5వేలే ఇచ్చేది. గత ప్రభుత్వం రైతుబంధు డబ్బులు జమ చేసేందుకు 160 రోజులు పట్టేది. గత ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు ఎగ్గొట్టిన వడ్డీలేని రుణాలను కూడా అందిస్తున్నాం. మా ప్రభుత్వ హయాంలో మహిళలకు రూ.లక్ష కోట్ల రుణాలు ఇస్తాం. ఇప్పటికే మహిళలకు రూ.67 వేల కోట్లు వడ్డీ లేని రుణాలు ఇచ్చాం. మహిళలకు ఇచ్చే వడ్డీ లేని రుణాల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాం' అని డిప్యూటీ సీఎం భట్టి స్పష్టం తెలిపారు.

# ఈ నెల 15 నుంచి ఉద్యోగుల హెల్త్ కార్డులు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల కోసం ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్) కింద హెల్త్ కార్డులను ఈనెల 15 నుంచి అమలు చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో నిర్ణయించారు. ఈ సందర్భంగా.. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి చేతుల మీదుగా త్వరలో ఉద్యోగులకు హెల్త్ కార్డులను అధికారికంగా పంపిణీ చేయనున్నట్లు సమావేశంలో వెల్లడించారు. ఉద్యోగులు, పెన్షనర్లకు మెరుగైన, నగదు రహిత వైద్య సేవలు అందించేందుకు ఈ హెల్త్ కార్డు విధానం ఉపయోగపడుతుందని సమావేశంలో అభిప్రాయపడుతూ, అమలుకు సంబంధించిన ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ప్రధాన కార్యదర్శి ఆదేశించారు.

**క్యూఆర్ కోడ్ తో..**

క్యూఆర్ కోడ్ తో నూతన హెల్త్ కార్డులు మొబైల్ నుండి డౌన్లోడ్ చేసుకోవచ్చు. అన్ని వివరాలతో ఈహెచ్సీటీ యాప్ రూపొందించనున్నారు. చికిత్సలకు సీజీహెచ్ఎస్ రేట్లు వర్తింపచేయాలని నిర్ణయించారు. నాలుగు రోజుల్లో నూతన ఈహెచ్ఎస్ మార్గదర్శకాలకు సంబంధించిన ఉత్తర్వులను విడుదల చేయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 943 హాస్పిటల్స్ లో హెల్త్ కార్డులపై నగదు రహిత వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురానున్నారు. 2594 ప్రొసీజర్స్ కవర్ కానున్నాయి. నూతన ఈహెచ్ఎస్ మార్గదర్శకాలపై చర్చ కోసం ఈనెల 13వ తేదిన సీఈఓతో సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వ ఖర్చుతో అన్నీ జిల్లా కేంద్రంలో వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రతేక ప్రధాన కార్యదర్శి బీఎండీ.ఎక్కా, ముఖ్యకార్యదర్శి క్రిస్టినా చోంగ్తూ, ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్, డీజీ షికా గోయల్, కార్యదర్శులు హనుమంత్ కొండిబా, పాపిరెడ్డి, వాణి తదితర ఉన్నతాధికారులు సమావేశంలో ఉన్నారు. ఉద్యోగ సంఘాల ప్రతినిధులు టీఎన్‌జీవో అధ్యక్షులు మారం జగదీశ్వర్, టీజీవో అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు, టీజీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. శ్యామ్, దామోదర్ రెడ్డి (పీఆర్‌టీయూ), చావా రవి (యూటీఎఫ్), శ్రీనివాసరెడ్డి (సెక్రటేరియట్ అసోసియేషన్), వంగా రవీందర్ రెడ్డి (ట్రెసా), సదానంద గౌడ్ (ఎస్‌టీయూ), సైదులు (ఎస్‌టీఎఫ్), దాస్య నాయక్ (క్లాస్-4 ఉద్యోగుల సంఘం), పెన్షనర్ల సంఘ ప్రతినిధులు వెంకటరెడ్డి, కృష్ణమూర్తి, ఉమాదేవి పాల్గొన్నారు.

# సంపాదకీయం



# దేశభక్తే దేశద్రోహం కాదు

గత దశాబ్దానికి పైగా భారత రాజకీయాల్లో అత్యంత ఎక్కువగా వినిపిస్తున్న పదాల్లో "దేశభక్తి" ఒకటి. ఎన్నికల ప్రచారాల నుంచి పార్లమెంట్ చర్చల వరకు, టెలివిజన్ డిబేట్ల నుంచి సామాజిక మాధ్యమాల వరకు దాదాపు ప్రతి అంశాన్నీ దేశభక్తి కోణంలోనే చూడాలనే ధోరణి బలపడుతోంది. దేశాన్ని ప్రేమించడం ప్రతి భారతీయుడి సహజ స్వభావం. స్వాతంత్ర్య సమరయోధులు ప్రాణత్యాగాలతో సాధించిన స్వేచ్ఛను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత. అయితే దేశభక్తి అంటే కేవలం ప్రభుత్వాన్ని సమర్థించడమేనా? లేక దేశ ప్రజల సంక్షేమం కోసం వ్యవస్థలోని లోపాలను ప్రశ్నించడం కూడా దేశభక్తిలో భాగమేనా? అనే ప్రశ్నలు నేడు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయి.ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం, దేశం రెండూ ఒకటి కావు. ప్రభుత్వం ఎన్నికల ద్వారా ఏర్పడే తాత్కాలిక వ్యవస్థ. దేశం మాత్రం ప్రజలు, రాజ్యాంగం, ప్రజాస్వామ్య విలువలు, సంస్థలు, సంస్కృతి, భవిష్యత్ తరాల సమష్టి స్వరూపం. అందువల్ల ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నించడం దేశాన్ని వ్యతిరేకించడం కాదు. ప్రజల తరఫున ప్రభుత్వాన్ని జవాబుదారీగా నిలబెట్టడమే ప్రజాస్వామ్య స్ఫూర్తి. ఈ మౌలిక సత్యం మరుగున పడినప్పుడే దేశభక్తి అనే భావన రాజకీయ నినాదంగా మారుతుంది.ప్రతి ఎన్నికల సమయంలో ప్రజలకు ఎన్నో హామీలు ఇవ్వడం భారత రాజకీయాల్లో కొత్త విషయం కాదు. అయితే గత కొన్నేళ్లుగా ఉద్యోగాల కల్పన, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడం, అవినీతిని నిర్మూలించడం, పారదర్శక పాలన అందించడం వంటి హామీలు విస్తృతంగా ప్రచారం పొందాయి. కానీ వాటి అమలుపై ఇప్పటికీ అనేక ప్రశ్నలు వినిపిస్తున్నాయి. యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగం, ప్రభుత్వ ఉద్యోగాల నియామకాల్లో జాప్యం, పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీలు, విద్యా వ్యవస్థలోని అసమానతలు, చిన్న వ్యాపారుల ఇబ్బందులు, రైతుల ఆర్థిక సంక్షోభం వంటి అంశాలు సామాన్య ప్రజల జీవితాలను ప్రభావితం చేస్తున్నాయి. ఇవి రాజకీయ విమర్శలకే పరిమితం కాని సామాజిక వాస్తవాలు.ప్రజలు ఈ సమస్యలపై ప్రశ్నలు లేవనెత్తినప్పుడు వాటికి సమాధానాలు ఇవ్వడం ప్రభుత్వ బాధ్యత. కానీ కొన్నిసార్లు విమర్శకులను "దేశద్రోహులు", "అర్బన్ నక్సల్స్", "టుక్డే టుక్డే గ్యాంగ్" వంటి ముద్రలతో కొట్టిపారేయడం ప్రజాస్వామ్య చర్చను బలహీనపరుస్తుంది. ఒక వ్యక్తి ప్రభుత్వ విధానాన్ని వ్యతిరేకించినంత మాత్రాన దేశాన్ని వ్యతిరేకించినట్లు కాదు. ఈ రెండింటి మధ్య తేడాను గుర్తించకపోతే ప్రజాస్వామ్య వ్యవస్థలో విమర్శలకు స్థానం క్రమంగా కుంచించుకుపోతుంది.ఇటీవల యువతలో వ్యక్తవ-ఀవుతున్న అసంతృప్తి కూడా ఇదే విషయాన్ని ప్రతిబింబిస్తోంది. ఉపాధి అవకాశాలు, పోటీ పరీక్షల పారదర్శకత, విద్యా ప్రమాణాలు, ప్రభుత్వ నియామకాలపై సామాజిక మాధ్యమాల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. కొందరు యువకులు వ్యంగ్య ప్రచారాల ద్వారా తమ నిరసనను వ్యక్తం చేస్తున్నారు. వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపేందుకు రూపొందించిన వ్యంగ్య ఉద్యమాలను కూడా దేశద్రోహంగా చిత్రీకరించడం ప్రజాస్వామ్య సంస్కృతికి అనుకూలం కాదు. వ్యంగ్యం, విమర్శ, నిరసన వంటి వ్యక్తీకరణలు ప్రజాస్వామ్య సమాజాల్లో సహజమైనవే. వాటిని అణచివేయడం కంటే వాటి వెనుక ఉన్న సమస్యలను అర్థం చేసుకోవడం పాలకుల పరిపక్వతకు నిదర్శనం.చరిత్ర చెబుతున్న ఒక గొప్ప పాఠం ఏమిటంటే ప్రశ్నించే సమాజాలే అభివృద్ధి చెందాయి. విజ్ఞానం, శాస్త్రం, సాంకేతికత, సామాజిక సంస్కరణలు అన్నీ ప్రశ్నల నుంచే పుట్టుకొచ్చాయి. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కూడా రాజ్యాంగం విజయవంతం కావాలంటే రాజ్యాంగ స్ఫూర్తిని గౌరవించే రాజకీయ సంస్కృతి అవసరమని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో విభిన్న అభిప్రాయాలను అంగీకరించడం బలహీనత కాదు; అదే దాని బలం.లద్దాఖ్ పర్యావరణ పరిరక్షణ కోసం ఉద్యమిస్తున్న సోనమ్ వాంగ్‌చుక్ వంటి వ్యక్తులు ప్రకృతి, స్థానిక సమాజాల హక్కుల గురించి ప్రశ్నిస్తున్నారు. విద్యా వ్యవస్థలోని లోపాలపై మాట్లాడుతున్న ఉపాధ్యాయులు, సామాజిక కార్యకర్తలు, యువత తమ అనుభవాలను ప్రజల ముందుకు తీసుకువస్తున్నారు. వారి ప్రతి అభిప్రాయంతో అందరూ ఏకీభవించాల్సిన అవసరం లేదు. కానీ వారు లేవనెత్తిన ప్రశ్నలను వినడం, వాస్తవాలను పరిశీలించడం, అవసరమైన చోట సంస్కరణలు చేపట్టడం ప్రభుత్వ బాధ్యత. అదే ప్రజాస్వామ్య పాలనకు తగిన స్పందన.దేశభక్తి అంటే కేవలం జాతీయ జెండాకు వందనం చేయడం, జాతీయ గీతాన్ని ఆలపించడం, సైన్యాన్ని గౌరవించడం మాత్రమే కాదు. పన్నులు నిజాయితీగా చెల్లించడం, చట్టాలను పాటించడం, అవినీతిని వ్యతిరేకించడం, పర్యావరణాన్ని కాపాడడం, బలహీన వర్గాల హక్కులను రక్షించడం, ప్రభుత్వాన్ని జవాబుదారీగా నిలబెట్టడం కూడా దేశభక్తే. రాజ్యాంగం ప్రతి పౌరుడికి భావ ప్రకటనా స్వేచ్ఛను కల్పించింది. అదే సమయంలో ఇతరుల హక్కులను గౌరవించే బాధ్యతను కూడా అప్పగించింది. ఈ రెండింటి మధ్య సమతుల్యతే ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి పునాది.ప్రపంచంలోని అనేక బలమైన ప్రజాస్వామ్య దేశాల్లో ప్రభుత్వాలపై తీవ్రమైన విమర్శలు జరుగుతుంటాయి. పార్లమెంట్లు, న్యాయస్థానాలు, మీడియా, విశ్వవిద్యాలయాలు, పౌరసంఘాలు ప్రభుత్వ విధానాలను నిరంతరం ప్రశ్నిస్తుంటాయి. ఆ దేశాలు ఆ విమర్శలను దేశద్రోహంగా పరిగణించవు. ఎందుకంటే ప్రశ్నలు ప్రభుత్వాలను మరింత బాధ్యతాయుతంగా పనిచేయించే అవకాశంగా భావిస్తాయి. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలంటే విమర్శలను వినగలిగే సామర్థ్యం ప్రభుత్వాలకు అవసరం.అయితే విమర్శలు కూడా బాధ్యతాయుతంగా ఉండాలి. తప్పుడు సమాచారం, ద్వేషప్రచారం, హింసకు ప్రేరేపించే వ్యాఖ్యలు, సమాజాన్ని విభజించే ప్రచారానికి ప్రజాస్వామ్యంలో స్థానం ఉండదు. అలాగే ప్రభుత్వాలు కూడా ప్రతి విమర్శను కుట్రగా లేదా దేశవ్యతిరేక చర్యగా చిత్రీకరించకుండా వాస్తవాలను ఆధారంగా తీసుకుని స్పందించాలి. ప్రజాస్వామ్యం అంటే ప్రభుత్వం, ప్రతిపక్షం, మీడియా, పౌర సమాజం పరస్పరం ఒకరినొకరు జవాబుదారీగా ఉంచే వ్యవస్థ.అధికార బలం ఎప్పటికీ శాశ్వతం కాదు. చరిత్రలో ఎన్నో ప్రభుత్వాలు ప్రజల అసంతృప్తిని పట్టించుకోకుండా అణచివేత మార్గాన్ని ఎంచుకుని చివరికి ప్రజల తీర్పును ఎదుర్కొన్నాయి. ప్రశ్నించే గొంతుకలను తాత్కాలికంగా నిశ్శబ్దం చేయవచ్చు. కానీ నిరుద్యోగ యువకుడి ఆవేదనను, రైతు బాధను, విద్యార్థి నిరాశను, మధ్యతరగతి కుటుంబాల ఆర్థిక ఒత్తిడిని అణచివేయడం సాధ్యం కాదు. సమస్యలను దాచిపెట్టడం వల్ల అవి మాయమవ్వవు; మరింత తీవ్రమవుతాయి.భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంగా గర్విస్తుంది. ఆ గౌరవాన్ని నిలబెట్టుకోవాలంటే ప్రజల ప్రశ్నలకు సమాధానాలు చెప్పే సంస్కృతి బలపడాలి. విమర్శలను సహించే రాజకీయ పరిపక్వత పెరగాలి. ప్రజల ఆకాంక్షలను వినే పాలన ఏర్పడాలి. రాజ్యాంగం కల్పించిన హక్కులు, స్వేచ్ఛలు కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా ఆచరణలో కనిపించాలి.అంతిమంగా ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి. ప్రభుత్వాన్ని ప్రశ్నించడం దేశాన్ని ద్వేషించడం కాదు; దేశం మెరుగుపడాలని కోరుకోవడం. లోపాలను ఎత్తిచూపడం వ్యవస్థను బలహీనపరచడం కాదు; దాన్ని మరింత సమర్థంగా మార్చాలనే ప్రయత్నం. ప్రజాస్వామ్యంలో నిజమైన దేశభక్తి అంటే అధికారాన్ని ప్రశ్నించే ధైర్యాన్ని గౌరవించడం, ప్రజల సమస్యలను పరిష్కరించే సంకల్పాన్ని ప్రదర్శించడం, రాజ్యాంగ విలువలను కాపాడడం. ఎందుకంటే దేశం అంటే కేవలం భూభాగం కాదుఆ దేశ ప్రజల గౌరవం, వారి హక్కులు, వారి భవిష్యత్తు. వాటిని కాపాడే ప్రతి స్వరం దేశభక్తే; దేశద్రోహం కాదు.

# బతుకు బండి నడిచేదెలా?

ప్రభుత్వాలు ప్రవేశపెట్టే ప్రతి పెద్ద సంస్కరణ మొదట గొప్ప ఆశయాలతోనే ప్రజల ముందుకు వస్తుంది. ఆర్థిక సంస్కరణలు, పన్ను విధానాలు, వ్యవసాయ మార్పులు, ఇంధన విధానాలు...ఇలా ప్రతి నిర్ణయం దేశ భవిష్యత్తును మార్చగలదనే వాగ్దానంతో ప్రారంభమవుతుంది. కానీ ఒక విధానం విజయాన్ని .. ప్రజల జీవితాల్లో తీసుకొచ్చే వాస్తవ మార్పులే నిర్ణయిస్తాయి. అందుకే ప్రజాస్వామ్యంలో ఏ ప్రభుత్వ విధానమైనా ప్రశంసలతోపాటు ప్రశ్నలను కూడా ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఎందుకంటే ప్రశ్నలు అభివృద్ధికి అడ్డంకి కావు. మెరుగైన విధాన రూపకల్పనకు అవే పునాది. కేంద్ర ప్రభుత్వం ఈ20 (20 శాతం ఇథనాల్ మిశ్రమ పెట్రోల్)ను భారతదేశ భవిష్యత్ ఇంధన విధానంలో ఒక కీలక సంస్కరణగా ప్రకటించింది. ప్రభుత్వం దృష్టిలో ఇది కేవలం ఇంధన మార్పు కాదు. విదేశీ చమురు దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించే వ్యూహం. దేశీయ బయోఫ్యూయల్ పరిశ్రమను బలోపేతం చేసే ఆర్థిక విధానం, కార్బన్ ఉద్గారాలను తగ్గించే పర్యావరణ చర్య. ఈ లక్ష్యాలన్నీ వినడానికి ఆకర్షణీయంగానే ఉంటాయి. అయితే ప్రజా విధానాలను కేవలం ఆశయాల ఆధారంగా అంచనా వేయడం సరిపోదు. ఆ ఆశయాలు వాస్తవంలో ఎలా అమలవుతున్నాయి? వాటివల్ల దేశానికి ఎంత లాభం? ప్రజలకు ఎంత భారం? అనే ప్రశ్నలకు సమాధానం వెతకాల్సిందే. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు పెరిగిన ప్రతిసారి దేశ ఆర్థికవ్యవస్థపై ఒత్తిడి పెరుగుతోంది. ఈ పరిస్థితుల్లో దేశీయంగా ఉత్పత్తి చేయగల ప్రత్యామ్నాయ ఇంధనాలను ప్రోత్సహించాలనే ఆలోచన సహేతుకమైనదే. కానీ ప్రత్యామ్నాయ ఇంధనం పేరుతో తీసుకొచ్చే ప్రతి సంస్కరణ కూడా శాస్త్రీయంగా, ఆర్థికంగా, పర్యావరణపరంగా సమతుల్యంగా ఉండాలి. లేకపోతే ఒక సమస్యను పరిష్కరించే ప్రయత్నంలో మరో పెద్ద సమస్యను సృష్టించే ప్రమాదం ఉంటుంది.

### ప్రశ్నించడం కూడా అవసరం

ప్రభుత్వం ఈ20 వల్ల చమురు దిగుమతులు తగ్గుతాయని, విదేశీ మారకద్రవ్యం ఆదా అవుతుందని, కాలుష్యం తగ్గుతుందని చెబుతోంది. అయితే ఇదే సమయంలో కొన్ని సహజమైన ప్రశ్నలు కూడా ముందుకు వస్తున్నాయి. ఇథనాల్ ఉత్పత్తి కోసం అవసరమయ్యే నీటి వినియోగం ఎంత? పాత వాహనాలు ఈ ఇంధనానికి ఎంతవరకు అనుకూలంగా ఉంటాయి? మైలేజీ తగ్గితే సాధారణ వాహనదారుడిపై అదనపు ఆర్థికభారం ఎంత? చెరకు సాగు పెరగడం వల్ల నీటి వనరులు, ఆహార భద్రతపై ఎలాంటి ప్రభావం పడుతుంది? ఈ ప్రశ్నలకు ప్రభుత్వం ప్రజలకు సమగ్రంగా సమాధానం ఇచ్చిందా? ఇక్కడే విధాన విశ్లేషణ అవసరం మొదలవుతుంది. ఎందుకంటే ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం ఒక విధానాన్ని రూపొందిస్తుంది. కానీ ఆ విధానాన్ని శాస్త్రీయంగా సమీక్షించడం, దాని బలాలు, బలహీనతలను పరిశీలించడం, ప్రజల ప్రయోజనాల దృష్టితో ప్రశ్నించడం కూడా అంతే అవసరం. ఒక విధానాన్ని ప్రశ్నించడం అంటే దాన్ని వ్యతిరేకించడం కాదు. దాన్ని మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా, ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా మార్చాలనే ప్రయత్నం.

### ఇంధన సామర్థ్యం తగ్గే అవకాశం

పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ కూడా ఈ20 అమలును దశలవారీగా చేపట్టాలని స్పష్టం చేసింది. దీనర్థం దేశంలోని వాహన తయారీరంగం, ఇంధన పంపిణీ వ్యవస్థ, వినియోగదారులు అందరూ ఒకేసారి ఈ మార్పుకు సిద్ధంగా లేరని విధాన రూపకర్తలే గుర్తించినట్లు అవుతోంది. ఒక ప్రజా విధానం విజయవంతం కావాలంటే దాని లాభాలతో పాటు పరిమితులను కూడా ప్రజలకు సమానంగా వివరించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ఈ చర్చలో అత్యంత కీలకమైన అంశం ఇంధన సామర్థ్యం. పెట్రోల్‌తో పోలిస్తే ఇథనాల్‌లో శక్తి సాంద్రత తక్కువగా ఉంటుంది. అందువల్ల ఈ20 కోసం ప్రత్యేకంగా రూపకల్పన చేయని కొన్ని వాహనాల్లో ఇంధన సామర్థ్యం స-ఀమారు 4 నుంచి 7 శాతం వరకు తగ్గే అవకాశం ఉందని నీతి ఆయోగ్ రోడ్‌మ్యాప్ పేర్కొంది. దీని అర్థం ప్రతి వాహనంలో ఒకే విధమైన ప్రభావం ఉంటుందనేది కాదు. కానీ వినియోగదారుడు అదే దూరం ప్రయాణించడానికి కొంత ఎక్కువ ఇంధనం వినియోగించాల్సి వచ్చే అవకాశం ఉందని ఇది సూచిస్తోంది.

### ప్రజలపై ఆర్థిక భారం

ఇక్కడే అత్యంత ముఖ్యమైన విధానపరమైన ప్రశ్న తలెత్తుతోంది. దేశానికి చమురు దిగుమతుల వ్యయం తగ్గితే అది జాతీయ స్థాయిలో లాభమే. కానీ అదే సమయంలో సాధారణ వాహనదారుడు ప్రతి నెలా అదనంగా ఇంధనం కొనుగోలు చేయాల్సి వస్తే, దేశానికి కలిగే లాభం, ప్రజలకు పడే భారం మధ్య ప్రభుత్వం సమగ్ర విశ్లేషణ చేసి ప్రజల ముందుంచిందా? ఒక సంస్కరణ విజయాన్ని ప్రభుత్వ ఖాతాల్లో కనిపించే ఆదాతో మాత్రమే కాదు. ప్రజల జేబుపై పడే ప్రభావంతో కూడా కొలవాలి. అందుకే ఈ20పై చర్చను కేవలం దేశ ప్రయోజనం అనే ఒక్క కోణంలో చూడటం సరిపోదు. వాహనాల సాంకేతిక అనుకూలత, వినియోగదారుల వ్యయం, సహజ వనరుల వినియోగం, వ్యవసాయంపై ప్రభావం, పర్యావరణ సమతుల్యత వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించినప్పుడే ఈ విధానం నిజమైన ప్రభావాన్ని అర్థం చేసుకోవచ్చు.

### కోట్లాది పాత వాహనాల సంగతేంటి?

ఈ నేపథ్యంలో అత్యంత ప్రాధాన్యం పొందుతున్న అంశం ఇథనాల్‌కు ఉన్న హైగ్రోస్కోపిక్ స్వభావం. ఇథనాల్ గాలిలోని తేమను ఆకర్షించే గుణాన్ని కలిగి ఉంటుంది. అధిక తేమ ఉన్న ప్రాంతాల్లో లేదా ఎక్కువకాలం నిల్వ చేసిన ఇంధనంలో ఫేజ్ సెపరేషన్ జరిగే అవకాశం ఉందని సాంకేతిక అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ఇంధన నాణ్యత దెబ్బతినడమే కాకుండా, ఈ20కు ప్రత్యేకంగా రూపకల్పన చేయని కొన్ని పాత వాహనాల్లో ఫ్యూయల్ ఫిల్టర్లు, ఇంజెక్టర్లు, పంపులు, రబ్బరు సీల్స్ వంటి భాగాల పనితీరుపై ప్రభావం పడే అవకాశం ఉంది. ఆధునిక ఈ20- అనుకూల వాహనాల్లో ఈ సమస్యలను తగ్గించే సాంకేతిక మార్పులు ఉన్నప్పటికీ, ప్రస్తుతం రోడ్లపై ఉన్న కోట్లాది పాత వాహనాల విషయంలో ప్రభుత్వం స్పష్టమైన సాంకేతిక మార్గదర్శకాలు, వినియోగదారుల అవగాహన కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉంది. నిర్వహణ వ్యయం పెరిగితే దాని ప్రభావం అత్యధికంగా ఆటోరిక్షా డ్రైవర్లు, టాక్సీ నిర్వాహకులు, డెలివరీ సేవలు, చిన్న వ్యాపారులు, రైతులు, గ్రామీణ ప్రాంతాల్లో పాత వాహనాలను ఉపయోగించే కుటుంబాలపై పడుతుంది.

### జల భద్రతపై ప్రభావం

ప్రస్తుతం భారతదేశంలో ఉత్పత్తి అవుతున్న ఇథనాల్‌లో ప్రధాన భాగం చెరకు, దాని ఉప ఉత్పత్తుల నుంచే వస్తోంది. అయితే చెరకు ప్రపంచంలో అత్యధిక నీటిని వినియోగించే వాణిజ్య పంటలలో ఒకటి. నివేదికలు ఇప్పటికే దేశంలోని అనేక ప్రాంతాల్లో భూగర్భ జలాల మట్టం పడిపోతున్నట్లు హెచ్చరిస్తున్నాయి. నీటి సంరక్షణను జాతీయ ప్రాధాన్య అంశంగా ప్రకటిస్తున్న ప్రభుత్వం, ఇథనాల్ ఉత్పత్తి కోసం అధిక నీటి అవ-సరం ఉన్న పంటలపై ఆధారపడటం దీర్ఘకాలంలో జల భద్రతపై ఎలాంటి ప్రభావం చూపుతుందనే అంశాన్ని స్పష్టంగా వివరించాల్సిన అవసరం ఉంది. చెరకు సాగు ప్రధానంగా కొన్ని రాష్ట్రాల్లోనే కేంద్రీకృతమై ఉంది. దేశంలోని చిన్న, సన్నకారు రైతులలో అత్యధికులు వర్షాధారిత వ్యవసాయంపైనే ఆధారపడుతున్నారు. రైతుల సంక్షేమం నిజంగా ప్రభుత్వ లక్ష్యమైతే, చెరకు ఆధారిత ఇథనాల్‌కే పరిమితం కాకుండా వ్యవసాయ వ్యర్థాలు, రెండో తరం (2జీ) బయోఫ్యూయల్స్, తక్కువ నీటి అవ-సరం ఉన్న ప్రత్యామ్నాయ ముడి పదార్థాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది.

### ఈ20పై కేంద్రం స్పష్టత ఇవ్వాలి

కేంద్ర ప్రభుత్వం ఈ20పై సమాధానం ఇవ్వాల్సిన కొన్ని ప్రశ్నలు ఇప్పటికీ మిగిలే ఉన్నాయి. భూగర్భ జలాలపై ప్రభావాన్ని నిరంతరం సమీక్షిస్తుందా? చెరకు ఆధారిత ఇథనాల్‌తో పాటు 2జీ బయోఫ్యూయల్స్‌కు మరింత ప్రాధాన్యం ఇస్తుందా? ఇంధన విధానాన్ని నీటి భద్రత, ఆహార భద్రత, వినియోగదారుల ప్రయోజనాలతో సమతుల్యం చేసే దీర్ఘకాల వ్యూహాన్ని రూపొందిస్తుందా? ఈ ప్రశ్నలు ప్రభుత్వాన్ని వ్యతిరేకించడానికి కాదు. ప్రభుత్వ విధానాన్ని మరింత బాధ్యతాయుతంగా, శాస్త్రీయంగా, ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా మార్చడానికి అవ-సరమైన ప్రశ్నలు. భారతదేశానికి ప్రత్యామ్నాయ ఇంధన విధానం అవసరం అనేది సందేహానికి తావులేని విషయం. అయితే ఇంధన స్వావలంబనను సాధించే క్రమంలో జల భద్రత, ఆహార భద్రత, రైతుల సంక్షేమం, వినియోగదారుల హక్కులు, పర్యావరణ సమతుల్యతలను కూడా సమానంగా కాపాడగలిగితేనే ఈ20 నిజమైన జాతీయ విజయంగా నిలుస్తుంది.

# అభివృద్ధి నీడలో చెత్త కొండ

హైదరాబాద్ ప్రపంచస్థాయి నగరంగా ఎదుగుతోందని ప్రభుత్వం గర్వంగా చెబుతోంది. ఐటీ, ఫార్మా, స్టార్టప్‌లు, మెట్రో రైలు, ఫ్లైఓవర్లు, విస్తరిస్తున్న రహదారులు... ఇవన్నీ అభివృద్ధికి కనిపించే ముఖచిత్రం. కానీ ఒక నగర అభివృద్ధిని కేవలం మౌలిక సదుపాయాలతోనే కొలవలేం. ఆ నగరం తన వ్యర్థాలను ఎంత శాస్త్రీయంగా నిర్వహిస్తున్నదన్నదే అసలు నాగరికతకు కొలమానం. ఆ పరీక్షలో హైదరాబాద్ ఇప్పటికీ వెనుకబడిందనే వాస్తవాన్ని జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ స్పష్టంగా గుర్తు చేస్తోంది.ప్రతిరోజూ గ్రేటర్ హైదరాబాద్ నుంచి వేల టన్నుల చెత్త జవహర్‌నగర్‌కు తరలిపోతోంది. దశాబ్దాలుగా పేరుకుపోయిన వ్యర్థాలు అక్కడ ఒక భారీ చెత్త కొండగా మారాయి. అది కేవలం వ్యర్థాల నిల్వ కాదు; నిశ్శబ్దంగా విస్తరిస్తున్న పర్యావరణ సంక్షోభం. అభివృద్ధి పేరుతో నగరం తన సమస్యలను ఒక ప్రాంతంపై మోపడం ఎంత ప్రమాదకరమో ఈ డంప్‌సైట్ చెబుతోంది.సేంద్రియ వ్యర్థాలు కుళ్లిపోవడంతో విడుదలయ్యే మీథేన్ వాయువు కార్బన్ డైఆక్సైడ్ కంటే అనేక రెట్లు ఎక్కువగా భూతాపాన్ని పెంచే గ్రీన్‌హౌస్ వాయువు. వాతావరణ మార్పులను వేగవంతం చేయడంలో మీథేన్ కీలక పాత్ర పోషిస్తోందని ప్రపంచవ్యాప్తంగా శాస్త్రీయ పరిశోధనలు నిర్ధారించాయి. అందువల్ల జవహర్‌నగర్ సమస్యను కేవలం స్థానిక చెత్త సమస్యగా చూడలేం. అది హైదరాబాద్ నగరం వాతావరణ బాధ్యతకు, దేశ పర్యావరణ కట్టుబాట్లకు సంబంధించిన అంశం కూడా.అయితే ఈ సంక్షోభానికి మొదటి బలులు జవహర్‌నగర్ పరిసర ప్రాంతాల ప్రజలే. జవహర్‌నగర్, నాగారం, ఈసీఐఎల్, చక్రిపురం, రాంపల్లి, ఘట్‌కేసర్, ఉప్పల్, ఏఎస్ రావు నగర్, కీసర, నేరేడ్మెట్, తిరుమలగిరి తదితర ప్రాంతాల ప్రజలు సంవత్సరాలుగా దుర్వాసన, గాలి కాలుష్యం, ఈగలు, దోమలు, కలుషిత వాతావరణంతో జీవిస్తున్నారు. శ్వాసకోశ వ్యాధులు, చర్మ సమస్యలు, మూత్రపిండాల సంబంధిత అనారోగ్యాలపై స్థానికులు పదేపదే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భూగర్భ జలాల నాణ్యతపై కూడా అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అభివృద్ధి ఫలాలను ఒక వర్గం అనుభవిస్తుండగా, దాని మూల్యాన్ని మరో వర్గం ఆరోగ్యంతో చెల్లించడం ప్రజాస్వామ్య పాలనకు తగదు.ఈ సమస్య తీవ్రతను న్యాయవ్యవస్థ కూడా గుర్తించింది. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) పలుమార్లు జవహర్‌నగర్ డంప్‌సైట్ నిర్వహణపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఐఐటీ బొంబే నిపుణుల నివేదిక ఆధారంగా శాస్త్రీయ నిర్వహణ చేపట్టాలని సూచించడమే కాకుండా, తాజా చెత్త డంపింగ్‌పై కూడా కఠిన ఆదేశాలు జారీ చేసింది. ఈ పరిణామాలను జాతీయ మీడియా విస్తృతంగా వెలుగులోకి తీసుకొచ్చింది. అయినప్పటికీ పరిస్థితిలో గణనీయమైన మార్పు కనిపించకపోవడం పాలనా వైఫల్యానికే సంకేతం.సమస్యకు పరిష్కారం అసాధ్యం కాదు. ప్రపంచవ్యాప్తంగా అనుసరిస్తున్న వికేంద్రీకృత ఘన వ్యర్థాల నిర్వహణ విధానాన్ని హైదరాబాద్‌లో సమర్థంగా అమలు చేయాల్సిన అవసరం ఉంది. ప్రతి ఇంటి వద్దనే తడి, పొడి, ప్రమాదకర వ్యర్థాలను వేరు చేయడం తప్పనిసరి చేయాలి. సేంద్రియ వ్యర్థాలను కంపోస్టుగా మార్చాలి. పునర్వినియోగానికి అనువైన పదార్థాలను రీసైక్లింగ్ చేయాలి. మిగిలిన వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే సాంకేతికతను విస్తరించాలి. ముఖ్యంగా ల్యాండ్‌ఫిల్ నుంచి వెలువడే మీథేన్ వాయువును సేకరించి ఇంధనంగా వినియోగించే వ్యవస్థలను అత్యవసరంగా ఏర్పాటు చేయాలి. చెత్తను సమస్యగా కాకుండా వనరుగా మార్చే దిశగా అడుగులు వేయాల్సిన సమయం ఆసన్నమైంది.ప్రపంచస్థాయి నగరమనే గుర్తింపు ఎత్తైన భవనాలతో, విశాలమైన రహదారులతో మాత్రమే రాదు.

పర్యావరణాన్ని కాపాడే విధానాలు, ప్రజల ఆరోగ్యాన్ని రక్షించే పాలన, భవిష్యత్ తరాలకు సురక్షితమైన నగరాన్ని అందించే బాధ్యతతోనే వస్తుంది. జవహర్‌నగర్ చెత్త కొండ హైదరాబాద్ అభివృద్ధిపై పడిన మచ్చగా మిగలాలా, లేక శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణకు నాందిగా మారాలా అన్నది ఇప్పుడు ప్రభుత్వ నిర్ణయంపైనే ఆధారపడి ఉంది. ఆలస్యం చేస్తే ఈ చెత్త కొండ మరింత పెద్ద పర్యావరణ, ఆరోగ్య సంక్షోభంగా మారే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవడం అత్యవసరం.

# ‘చోటా బాస్’ హల్‌చల్..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్ర పరిశ్రమల శాఖలో ఈ మధ్య కొత్తగా వచ్చిన చిన్న బాస్ వేధింపులు తారాస్థాయికి వెళ్లినట్లు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ప్రతి ఫైల్‌పై ఏదో ఒక క్వొరీ వేసి అధికారులను సతాయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఎంప్లాయీస్ ఆఫీసుకు వచ్చేందుకు జంకుతుండగా, కొందరైతే లాంగ్ లీవ్‌కు ప్లాన్ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నది. ఆయన తీరుతో విసిగిపోయిన బాధితులు చీఫ్ సెక్రటరీకి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నట్టు తెలిసింది. అప్పుడు కూడా ఆయన వ్యవహార తీరులో మార్పు రాకపోతే సామూహిక సెలవులు పెట్టాలని యోచనలో ఉన్నట్లు సమాచారం.

**ఇక్కడ నా రూల్స్‌ను పాటించాలి..**

విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడానికి సెక్రటేరియట్‌కు ప్రత్యేక బిజినెస్ రూల్స్ ఉన్నాయి. ఆ రూల్స్ ప్రకారమే సెక్షన్ ఆఫీసర్ మొదలుకుని చీఫ్ సెక్రటరీ వరకు పనిచేయాల్సి ఉంటుంది. కానీ ఇండస్ట్రీ శాఖకు కొత్తగా వచ్చిన చిన్న బాస్ తన సొంత రూల్స్‌ను మాత్రమే పాటించాలని ఆదేశాలు జారీ చేసినట్లు ప్రచారం జరుగుతున్నది. హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్స్ నుంచి వచ్చే ప్రపోజల్స్‌ను సంబంధిత సెక్షన్ అధికారులు ఆయా శాఖల సెక్రటరీలకు పంపుతుంటారు. ఆ ప్రపోజల్స్‌ను ఆమోదించడమో లేదా తిరస్కరించడమో చేయాలి. ఒకవేళ ఏదైనా అదనపు సమాచారం అవసరం ఉంటే తెప్పించుకుని, తుది నిర్ణయం తీసుకోవాలి. కానీ కొత్తగా వచ్చిన చిన్న బాస్ మాత్రం ప్రతి ఫైల్‌పై క్వొరీలు వేయడం పనిగా పెట్టుకుని, అధికారులను సతాయిస్తున్నట్లు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఎవరైనా ధైర్యం చేసి బిజినెస్ రూల్స్‌కు విరుద్ధంగా క్వొరీలు ఉన్నాయంటే ‘ఇక్కడ నా రూల్స్ మాత్రమే పాటించాలి. నేను చెప్పిందే చెయ్యాలి’ అని ఆదేశిస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నది.

**సెక్షన్‌లో చక్కర్లు, ర్యాక్స్‌ల్లో తనిఖీలు..**

సెక్రటేరియట్‌లో పనిచేస్తోన్న సెక్రటరీలు తమకు కేటాయించిన చాంబర్‌లో కూర్చొని ఫైల్ చూస్తుంటారు. ఏదైనా అర్జెంట్ అయితే సంబంధిత సెక్షన్‌కు వెళ్లి అక్కడ ఉన్న అధికారులకు ఆదేశాలు ఇచ్చి వస్తుంటారు. కానీ చిన్న బాస్ మాత్రం రోజుకు రెండు, మూడుసార్లు సెక్షన్ల వద్దకు వెళ్లి అక్కడ పనిచేస్తోన్న ఉద్యోగులను ఉద్దేశించి ‘నేను చెప్పిన పని ఏమైంది? నేను చెప్పినట్లుగా మాత్రమే చెయ్యాలి’ అని సతాయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అక్కడ ఉన్న బీరువాలను తనిఖీ చేయడం, అక్కడ ఉన్న ఫైల్స్‌ను ఆరా తీయడం చేస్తున్నట్లు తెలుస్తున్నది. అయితే ప్రతిరోజు ఆ విధంగా సెక్షన్‌కు వచ్చి వెళ్లడం వెనుక చిన్న బాస్ ఉద్దేశ్యం ఏంటి? అనే దానిపై ఉద్యోగులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

**నేరుగా సెక్రటేరియట్ పోస్టింగ్‌తో కష్టాలు..**

హెచ్ఓడీల్లో పనిచేసిన అనుభవం ఉన్న బ్యూరోక్రట్స్‌కే సెక్రటేరియట్‌లో పోస్టింగ్ ఇవ్వాలి. అప్పుడే సెక్రటేరియట్ బిజినెస్ రూల్స్‌పై అవగాహన ఏర్పడి నిర్ణయాల్లో పారదర్శకత, వేగం ఉంటుంది. కానీ ఈ మధ్య చాలామందికి హెచ్ఓడీల్లో పనిచేసిన అనుభవం లేకున్నా నేరుగా సెక్రటేరియట్‌లో పోస్టింగ్స్ ఇవ్వడం వల్ల వివాదాలు మొదలవుతున్నాయి. ఇండస్ట్రీ శాఖలో కొత్తగా వచ్చిన చిన్న బాస్ తీరు, ఆయన సూటిపోటి మాటలతో విసిగిపోయిన కొందరు ఎంప్లాయీస్ లాంగ్ లీవ్స్‌కు వెళ్లేందుకు ప్లాన్ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నది. అయితే ముందుగా ప్రధాన కార్యదర్శిని కలిసి డిపార్ట్‌మెంట్‌లోని పరిస్థితులను ఆయన దృష్టికి తీసుకెళ్లాలని, అప్పుడు కూడా మార్పు లేకపోతే సామూహిక సెలవులకు వెళ్లాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలిసింది.



# సీఎంకు కంటి పరీక్షలు చేయాల్సిందే..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో ‘హైడ్రా’ కూల్చివేతల పర్వం రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. ఈ నేపథ్యంలోనే తెలంగాణ రక్షణ సేన చీఫ్, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సీఎం రేవంత్ రెడ్డి టార్గెట్‌గా ‘X’ (ట్విట్టర్) వేదికగా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. హైడ్రా అమలులో ప్రభుత్వం ద్వంద్వ వైఖరిని అవలంబిస్తోందని ఆమె మండిపడ్డారు. హైడ్రాను అడ్డం పెట్టుకుని హైదరాబాద్‌లోని నిరుపేదలను రేవంత్ సర్కార్ బుల్డోజర్ల కింద నలిపేస్తోందని ధ్వజమెత్తారు. ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీకి చెందిన విద్యాసంస్థలను కాపాడటానికి ఏకంగా కోర్టులను కూడా తప్పుదోవ పట్టిస్తోందని కవిత సంచలన ఆరోపణలు చేశారు.

**సీఎంకు కంటి పరీక్ష అవసరం..**

ఒవైసీ విద్యాసంస్థల నిర్మాణాలు చెరువులను కబ్జా చేసి కట్టారనే విషయం స్పష్టంగా కనిపిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కల్వకుంట్ల కవిత ఎద్దేవా చేశారు. చెరువును కబ్జా చేసి కట్టిన కాలేజీ ప్రపంచమంతా చూస్తున్నా.. సీఎం రేవంత్ రెడ్డి కి మాత్రమే కనిపించడం లేదని అన్నారు. దీన్ని బట్టి చూస్తే తక్షణమే ఆయనకు కంటి పరీక్ష చేయించుకోవలసిన అవసరం ఉందని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూలుస్తూ, బడాబాబుల ఆక్రమణలను మాత్రం కాపాడుతున్నారని కవిత ప్రభుత్వంపై సోషల్ మీడియా వేదికగా దుమ్మెత్తిపోస్తుండటం స్టేట్ పాలిటిక్స్‌లో చర్చనీయాంశంగా మారింది.

# మెటా షాకింగ్ రిప్లై!

**న్యూ ఢిల్లీ :** ప్రముఖ మెసేజింగ్ యాప్ వాట్సాప్ లో యాజమాన్యం మెటా తీసుకురాబోతున్న యూజర్ నేమ్ ఫీచర్‌పై ఇటీవల కేంద్ర ప్రభుత్వం నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే, ఆ నోటీసులకు తాజాగా ‘మెటా’ సమాధానం ఇచ్చింది. ప్రస్తుతం వారి వివరణను కేంద్ర ఐటీ మంత్రిత్వ శాఖ పరిశీలిస్తున్నట్లుగా అధికారిక వర్గాలు పేర్కొన్నారు. అయితే, ‘యూజర్ నేమ్’ ఫీచర్ ఇంకా లైవ్ కాలేదని, ఈ ఏడాది చివర్లో దశలవారీగా అందుబాటులోకి తెస్తామని వాట్సాప్ ప్రతినిధులు వారి వివరణలో తెలిపారు. యాప్ దుర్వినియోగాన్ని అడ్డుకోవడానికి తాము పలు రకాల రక్షణ చర్యలు తీసుకుంటున్నట్లుగా వెల్లడించారు.

**ఫోన్ నెంబర్ హైడ్ చేయవచ్చు..**

తాము తీసుకురాబోయే యూజర్ నేమ్ ఫీచర్ ద్వారా వినియోగదారులు తమ ఫోన్ నంబర్‌ను ఇతరులకు షేర్ చేయకుండానే హైడ్ చేసి చాట్ చేయవచ్చని పేర్కొన్నారు. కానీ, కొత్త వాట్సాప్ అకౌంట్ క్రియేట్ చేయడానికి ఫోన్ నంబర్ తప్పనిసరి అని తెలిపారు. అయితే, యూజర్ నేమ్ విషయంలో ఇప్పటికే ప్రభుత్వ సంస్థలు, సెలబ్రిటీలు, ప్రజాప్రతినిధులు, వెరిఫైడ్ ఖాతాల పేర్లను వాట్సాప్ ముందే రిజర్వ్ చేసింది. దీంతో పేర్లతో ఫేక్ అకౌంట్ల ను ఎవరూ కూడా క్రియేట్ చేయలేరని వాట్సాప్ తన వివరణలో చెప్పుకొచ్చింది. ఒక అకౌంట్ నుంచి కొత్తగా ఎంతమందికి మెసేజ్ పంపాలో పరిమితి ఉంటుందని.. అలాగే యూజర్ నేమ్‌లను పదే పదే ఊహించి టైప్ చేసే ప్రయత్నాలను కూడా అడ్డుకుంటామని తెలిపారు. ఇక ఎవరైనా కొత్త యూజర్ నేమ్ ద్వారా మెసేజ్ పంపితే, సదరు అకౌంట్ కొత్తదా.. పాతదా? మీ ఇద్దరికీ కామన్ గ్రూపులు ఉన్నాయా?
లేదా అది వేరే దేశానికి చెందిన అకౌంటా? అనే వివరాలను వాట్సాప్ స్క్రీన్‌పై చూపిస్తుందని ఆ సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు.కాగా, వాట్సాప్ ప్రతిపాదించిన ‘యూజర్‌నేమ్’ ఫీచర్‌తో ఆన్‌లైన్ మోసాలు, ఫిషింగ్, డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లు, ఇతరుల పేర్లతో నకిలీ ప్రొఫైళ్లు సృష్టించి మోసం చేసే నేరాలు పెరుగుతాయని కేంద్ర ప్రభుత్వం ఇటీవల మాతృ సంస్థకు ‘మెటా’ సంస్థకు నోటీసులు జారీ చేసింది. ఈ క్రమంలోనే కేంద్ర ఐటీ మంత్రిత్వ శాఖ వాట్సాప్ ఇచ్చిన సమధానం చర్చనీయాంశంగా మారింది.

# హరీష్ రావుకు కాంగ్రెస్ ‘ఆఫర్’..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** బీఆర్ఎస్, బీజేపీలపై తెలంగాణ పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాజకీయంగా, పార్టీ అంతర్గత వ్యవహారాలపై పలు సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ నేత హరీష్ రావును టార్గెట్ చేస్తూ పీసీసీ చీఫ్ ఘాటు విమర్శలు గుప్పించారు. “హరీష్ రావు గారు.. పదేళ్లు మంత్రిగా ఉండి మీరు ఏం చేశారు? ఇప్పుడు మళ్ళీ మూడు నెలల టైమ్ ఎందుకు ఇవ్వాలి? మీరు కట్టిన ప్రాజెక్టులు కుంగిపోయాయి. దానికి ఏం సమాధానం చెబుతారు? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధిని చూసి హరీష్ రావుకు మిట్ట మధ్యాహ్నమే చుక్కలు కనిపిస్తున్నాయని ఎద్దేవా చేశారు. ఇదే సమయంలో “హరీష్ రావు మా పార్టీలోకి వస్తానని చెబితే, మా పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ లో చర్చించి నిర్ణయం తీసుకుంటాం” అంటూ ఒక ఆసక్తికర వ్యాఖ్య చేశారు. బీఆర్ఎస్ నిధులపై స్పందిస్తూ.. కవిత చేసిన ఆరోపణల్లో నిజం ఉందన్నారు. ఒక రీజినల్ పార్టీకి రూ.1,400 కోట్లు ఎలా జమ అయ్యాయో చెప్పాలని, దీనిపై ఖచ్చితంగా అనుమానాలు వస్తున్నాయని అన్నారు.

**ఈటల రాజేందర్ ఆ రోజు ఏం చేశారు?**

బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌పై కూడా మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. రాష్ట్రంలో నీళ్ల దోపిడీ జరిగినప్పుడు, ప్రజల సొత్తు దుర్వినియోగం అయినప్పుడు ఈటల బీఆర్ఎస్ (ఆనాటి టీఆర్ఎస్)లోనే ఉన్నారని, ఆర్థిక మంత్రిగా కూడా పనిచేశారని గుర్తుచేశారు. ఆనాడు జరిగిన తప్పిదాలను ప్రశ్నించకుండా మౌనంగా ఉన్న ఈటల.. ఇప్పుడు బీఆర్ఎస్‌కు మద్దతు పలుకుతున్నట్లు కనిపిస్తోందని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ 12 ఏండ్ల బీజేపీ పాలనను ప్రజలు చూశారని, వారి గురించి తెలిసి ప్రజలు మళ్లీ గోతిలో పడరని అన్నారు. “జేపీ నడ్డా వచ్చినా.. ఎవరు వచ్చినా మాదొక్కటే సూటి ప్రశ్న. మీరు ఇస్తానన్న ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇచ్చి ఈ రాష్ట్రానికి రావాలి” అని డిమాండ్ చేశారు. కేంద్రం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని, మీ 12 ఏళ్ల పాలనలో సామాన్య ప్రజలకు ఒరిగింది ఏంటని నిలదీశారు.

**పార్టీలో క్రమశిక్షణ అందరికీ సమానమే..**

కాంగ్రెస్ పార్టీ అంతర్గత విషయాలపై స్పందిస్తూ పార్టీలో చిన్న చిన్న సమస్యలు ఉన్నాయని, అవన్నీ త్వరలోనే తొలగిపోతాయని స్పష్టం చేశారు. క్రమశిక్షణా కమిటీ అనేది అందరికీ సమానమేనని తేల్చిచెప్పారు. కడియం శ్రీహరి, కొండ సురేఖ, తుంగతుర్తి పంచాయతీ వ్యవహారాలపై ఇద్దరు సీనియర్ నాయకులను (సచిన్ సావంత్, జగ్గారెడ్డి) అబ్జర్వర్లుగా నియమించామని వెల్లడించారు. వారిద్దరూ క్షేత్రస్థాయి నుంచి విచారణ



జరిపి పార్టీకి నివేదిక ఇస్తారని, ఆ తర్వాతే క్రమశిక్షణా చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే కొంతమంది ఎమ్మెల్యేలు తమకు మద్దతు ఇచ్చారని సమర్థించుకున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పాలన బాగుందని, జనాలు తమను ఆదరిస్తున్నారని మహేష్ కుమార్ గౌడే ధీమా వ్యక్తం చేశారు. వేరే పార్టీలు తలుపులు తెరిచి ఉంచినా, మూసి ఉంచినా తమకు వచ్చే నష్టం ఏమీ లేదన్నారు. ఇక పార్టీలో ఎప్పటినుంచో పెండింగ్‌లో ఉన్న కార్పొరేషన్ పదవుల భర్తీపై కీలక అప్డేట్ ఇచ్చారు. ఈ నెల 15వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి మీనాక్షి నటరాజన్లతో చర్చించి కార్పొరేషన్ పదవులపై తుది నిర్ణయం తీసుకుంటామని పీసీసీ చీఫ్ ప్రకటించారు.

# ఏపీలో మళ్లీ కరోనా టెర్రర్..

**ఆంధ్రప్రదేశ్ :** ప్రపంచాన్ని అతలాకుతలం చేసినా కరోనా వైరస్ ఆంధ్రప్రదేశ్ లో మళ్లీ కలకలం రేపుతోంది. తాజాగా కడప జిల్లాలో కోవిడ్ తరహా లక్షణాలతో ఇద్దరు మృతి చెందడం తీవ్ర ఆందోళనను కలిగిస్తోంది. జిల్లాలో ఇటీవల కొందరికి చేసిన ఆర్టీపీసీఆర్ పరీక్షల్లో ఐదుగురికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. ఇదిలా ఉండగా, కడప నగరంతో పాటు రాజంపేట ప్రాంతాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు కరోనా లక్షణాలతో బాధపడుతూ చికిత్స పొందుతూ మృతిచెందారు. ఒకేసారి ఇద్దరు ప్రాణాలు కోల్పోవడంతో ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు.

**పూణే ల్యాబ్‌కు శ్యాంపిల్స్..**

అయితే, మృతుల వివరాలు తెలిసిన వెంటనే వైద్య అధికారులు రంగంలోకి దిగారు. కడప, రాజంపేట లోని బాధిత గ్రామాల్లో స్పెషల్ టీమ్స్ పర్యటించి, మృతుల కుటుంబ సభ్యులు, ప్రైమరీ కాంటాక్టుల వివరాలను సేకరిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో ఎవరికైనా జ్వరం, దగ్గు, శ్వాసకోస సమస్యలు ఉన్నాయా అనే కోణంలో సర్వే నిర్వహిస్తున్నారు. మృతుల మరణానికి గల ఖచ్చితమైన కారణాలు తెలుసుకునేందుకు బాధితుల నమూనాలను సేకరించి, ఉన్నత విచారణ కోసం పూణే లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ ల్యాబ్‌కు పంపించారు. ఇక్కమరో ట్విస్ట్ ఏంటంటే.. జిల్లాలో కరోనా వైరస్ వ్యాప్తి, మరణాలపై ఇప్పటి వరకు వైద్య, ఆరోగ్య శాఖ ఎలాంటి అధికారిక ప్రకటన చేయకపోవడం గమనార్హం.

# హైదరాబాద్‌లో డ్రగ్స్ కలకలం..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ అత్తాపూర్‌లో ఎస్‌వోటీ, స్థానిక పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి డ్రగ్స్ విక్రయిస్తున్న ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశారు. మహానగరంలో డ్రగ్స్ రవాణా, విక్రయాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఇందులో భాగంగా రాజేంద్రనగర్ ఎస్‌వోటీ బృందం, అత్తాపూర్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన మెరుపు దాడుల్లో ఒక ప్రమాదకర డ్రగ్స్ ముఠా గుట్టురట్టయింది. అత్తాపూర్ పరిధిలో యథేచ్ఛగా మాదకద్రవ్యాలను విక్రయిస్తున్న ఐదుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకోగా, మరో ఇద్దరు నిందితులు పోలీసుల నుంచి తప్పించుకుని పరారయ్యారు. పట్టుబడిన నిందితుల నుంచి భారీ మొత్తంలో ఎండీఎంఏ డ్రగ్స్, నిషిద్ధ ఇంజెక్షన్లు, టాబ్లెట్లతో పాటు ఒక కత్తి, ఐదు మొబైల్ ఫోన్లు, రూ. 16,930 నగదును పోలీసులు సీజ్ చేశారు.పోలీసుల ప్రాథమిక విచారణలో ఈ ముఠా డ్రగ్స్ సరఫరాకు సంబంధించిన కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. నిందితులు నగరంలోని దారుల్‌షిఫా ప్రాంతం నుంచి తక్కువ ధరకే ఈ డ్రగ్స్‌ను కొనుగోలు చేసి, వాటిని అత్తాపూర్‌కు తరలించి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు తేలింది. ఈ దందాలో వినియోగదారులకు డ్రగ్స్ చేరవేయడానికి సయ్యద్ అబుల్ హసన్ (A2) అనే ఆటో డ్రైవర్‌ను కీలక వనరుగా వాడుకున్నారు. అరెస్టయిన వారిలో సయ్యద్ అబుల్ హసన్‌తో పాటు సైఫ్ అలీ మీర్జా, అహ్మద్ హుస్సేన్, షేక్ అయూబ్, మీర్ షబ్బీర్ అలీ ఉన్నారు. ఈ ముఠాలో కీలకమైన ప్రధాన నిందితుడు (A1) బాకర్, ముజాహిద్ అనే ఇద్దరు వ్యక్తులు ప్రస్తుతం పరారీలో ఉన్నారు. వీరి కోసం పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. కాగా, ఈ కేసులో కీలకంగా ఉన్న హసన్‌పై గతంలోనే పలు పోలీస్ స్టేషన్లలో చోరీలు, దోపిడీలు, ఎన్‌డీపీఎస్ చట్టం కింద అనేక క్రిమినల్ కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. పాత నేరస్థులతో ముడిపడి ఉన్న ఈ డ్రగ్స్ నెట్‌వర్క్‌పై అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి, దీని వెనుక ఇంకా ఎవరెవరి హస్తం ఉందనే కోణంలో దర్యాప్తు జరుపుతున్నారు.

# ఆయిల్ పామ్ సాగు వైపు మొగ్గు చూపండి..




**సిద్దిపేట,ఫ్లాష్ ఇండియా :** ఆయిల్ పామ్ సాగు పెంచడానికి 5 ఎకరాలపైన ఉన్న రైతులతో సమావేశం ఏర్పాటు చేశామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈరోజు(శుక్రవారం) హుస్నాబాద్ నియోజకవర్గం అక్కన్నపేట మండలం జనగామ గ్రామంలో మెగా పామ్ ఆయిల్ ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి ఆయిల్ పామ్ మొక్కలు నాటారు. అనంతరం మంత్రి పొన్నం మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ డిమాండ్‌కి తగ్గ ఉత్పత్తి లేదని.. రైతులు ఆ సాగు వైపు మొగ్గు చూపాలని కోరారు. నర్మేటలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించినట్లు తెలిపారు.జిల్లాలో 50 వేల ఎకరాలు ఆయిల్ పామ్ సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని.. ఇప్పుడు 14 వేల ఎకరాలకు పైగా సాగు జరుగుతోందని మంత్రి తెలిపారు. ఒక్కో చిన్న గ్రామంలో 100 ఎకరాల ఆయిల్ పామ్ సాగు దాటిస్తే రూ.5 లక్షలు, పెద్ద గ్రామాల్లో 200 ఎకరాలపైన సాగు ప్రోత్సహిస్తే రూ.10 లక్షల అభివృద్ధి ప్రోత్సాహకాలు అందిస్తామని వెల్లడించారు. ఎల్‌నినో రాబోతోందని.. తీవ్ర కరవు కాటకాలు వర్షాభావ పరిస్థితులు ఉంటాయని మంత్రి తెలిపారు. దీంతో రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగు ద్వారా కోతుల బెడద ఉండదని.. వాతావరణ మార్పుల ఇబ్బంది ఉండదని చెప్పుకొచ్చారు. రాజకీయాలకు అతీతంగా రైతాంగం గురించి ఆలోచించే వారు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించాలని పొన్నం ప్రభాకర్ సూచించారు.

**దేశానికి ఆయిల్ పామ్ అత్యవసరం: వివేక్**

దేశానికి ఆయిల్ పామ్ అత్యవసరమని మంత్రి వివేక్ వెంకట స్వామి అన్నారు. ఇరాన్ యుద్ధం వల్ల ధరలు పెరుగుతున్నాయని.. ఆయిల్ పామ్ దిగుమతి చేసుకుంటే ఇబ్బందులు తప్పవని.. అందుకోసం సొంతంగా ఉత్పత్తి పెంచాలని కోరారు. గత సంవత్సరం కాళేశ్వరం ప్రాజెక్ట్ లేనప్పటికీ 25 శాతం అదనంగా వడ్లు కొనుగోలు చేయడం జరిగిందని చెప్పారు. ఆయిల్ పామ్‌కు పెద్దగా నీళ్లు అవసరం లేదన్నారు. చెన్నూరులో కూడా ఆయిల్ పామ్ సాగు వైపు చూస్తున్నారన్నారు ‘100 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేసిన గ్రామాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ రూ.5 లక్షలు ప్రోత్సాహకం ఇస్తే.. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా నేను కూడా రూ.5 లక్షలు ఇస్తాను’ అని మంత్రి వివేక్ ప్రకటించారు.

# పుట్టబోయే ప్రతీ బిడ్డకు బంగారు ఉంగరం

- "పోలీసులు మమ్మల్ని అప్రమత్తం చేయలేదు"
- తొక్కిసలాటపై ప్రభుత్వ వైఫల్యంపై విమర్శలు
- విపక్ష ఎమ్మెల్యేలపై విజయ్ ఎద్దేవా
- అవినీతిపై కఠిన చర్యలు తీసుకుంటాం
- 'టీవీకే' పాలన విశ్వరూపం చూపిస్తాం
- డీలిమిటేషన్‌ను పూర్తిగా వ్యతిరేకిస్తున్నాం
- ఎన్నికల హామీలన్నీ అమలు చేస్తాం

ప్రజల విశ్వాసమే మా ప్రభుత్వ బలం



**తమిళనాడు :** తమిళనాడు ముఖ్యమంత్రి, టీవీకే అధినేత విజయ్ కరూర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో కీలక వ్యాఖ్యలు చేశారు. కరూర్‌లో గతంలో జరిగిన ఘోర తొక్కిసలాట ఘటన తర్వాత ఆయన తొలిసారిగా ఇక్కడికి రావడంతో ఈ సభ ప్రాధాన్యత సంతరించుకుంది. సభలో విజయ్ మాట్లాడుతూ.. కరూర్ తొక్కిసలాట ఘటన తన జీవితంలోనే అతిపెద్ద విషాదమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదం వెనుక పెద్ద రాజకీయ కుట్ర దాగి ఉందంటూ సీఎం విజయ్ సంచలన ఆరోపణలు చేశారు. “ఆ రోజు కరూర్ పోలీసులు మమ్మల్ని అప్రమత్తం చేయలేదు. అక్కడ తొక్కిసలాట జరిగే అవకాశం ఉందనే విషయం పోలీసులకు ముందే తెలుసు. అయినప్పటికీ మమ్మల్ని కావాలనే మీటింగ్ ప్రాంగణానికి తీసుకెళ్లారు” అని విజయ్ మండిపడ్డారు.

**పాలనలో విశ్వరూపం చూపిస్తాం..**

ఇదే వేదికపై నుంచి విపక్షాలపై ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అసెంబ్లీలో తమను చూసి విపక్ష పార్టీల ఎమ్మెల్యేలు పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో అవినీతికి తావులేదని, అవినీతికి పాల్పడిన ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ‘టీవీకే’ పాలన ఎలా ఉంటుందో, ప్రభుత్వ విశ్వరూపం ఏంటో ప్రజలకు త్వరలోనే చూపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియను తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల వేళ ప్రజలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని తప్పకుండా అమలు చేస్తామని సీఎం విజయ్ పునరుద్ఘాటించారు.
అందులో భాగంగానే.. రాష్ట్రంలో త్వరలో పుట్టబోయే బిడ్డలకు తమ ప్రభుత్వం తరపున బంగారు ఉంగరాలు అందిస్తామని ఒక వినూత్న ప్రకటన చేశారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో కరూర్ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ఎస్ ఐ ఆర్ పై ప్రత్యేక సమావేశం




**తలకొండ పల్లి ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో సర్పంచి వానరాసి రాములమ్మ ఏర్పాటు చేసిన సర్ ఎన్యూమరేషన్ ఫారం పూరించే విధాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తహసీల్దార్ రమేష్ కుమార్. మాజీ ఎంపీపీ సిఎల్ శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాహసీల్దార్ రమేష్ మాట్లాడుతూ. ఎన్యూమరేషన్ పత్రం నింపే విధానం, సామాన్యులందరికి గ్రామ పంచాయతీ స్థాయి అధికార, సిబ్బంది, యువత సహకారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వారనాసి వెంకటేష్. డిప్యూటీ సర్పంచ్ శివ విజయలక్ష్మి విజయ్ కుమార్. రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యులు ముజిబుర్ రహమాన్. సెక్రటరీ వాజిద్, వి ఆర్ ఓ రమేష్ యాదవ్, శ్రీశైలం,నాయకులు నరేందర్ గౌడ్, బిఎల్వో చెంద్రకళ, సుధా, కల్పన , కారోబార్ రవి, తదితరులు పాలుగొన్నారు.

# త్వరలోనే నియామకాలు...

**గురుకుల కళాశాలను సందర్శించిన డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్**
**ఉపాధ్యాయుల కొరతపై అధికారులతో చర్చ.. త్వరలోనే నియామకాలు చేపడతామని హామీ**
**విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి**



**ఘట్కేసర్,ఫ్లాష్ఇండియా ప్రతినిధి :** మల్కాజ్గిరి కార్పొరేషన్ ఘట్కేసర్ సర్కిల్ పరిధిలోని ఘట్కేసర్ గురుకుల కళాశాలను మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ శుక్రవారం సందర్శించారు. కళాశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించి, ప్రిన్సిపాల్‌తో పాటు ఘట్కేసర్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు బొక్క ప్రభాకర్ రెడ్డి,మాజీ చైర్‌పర్సన్ మల్లి పావని జంగయ్య యాదవ్ తో సమావేశమై కళాశాల పరిస్థితులపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ, ఘట్కేసర్ గురుకుల కళాశాల నూతన భవన నిర్మాణం కోసం తాను నియోజకవర్గ ఇంచార్జిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలి నిధిగా రూ. 1.50 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు. కళాశాలలో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని ప్రిన్సిపాల్, మాజీ చైర్‌పర్సన్ పావని తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. వెంటనే సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడగా, అతి త్వరలోనే అవసరమైన ఉపాధ్యాయుల నియామక ప్రక్రియ చేపడతామని అధికారులు హామీ ఇచ్చినట్లు వజ్రేష్ యాదవ్ వెల్లడించారు. ప్రభుత్వ గురుకుల విద్యా సంస్థల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, విద్యా రంగ అభివృద్ధికి అవసరమైన ప్రతి చర్యను చేపడతామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, విద్యాశాఖ అధికారులు, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



# రాజ్యసభ సభ్యులు వేము నరేందర్ రెడ్డి ని కలిసిన ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్)

**ఉప్పల్,ఫ్లాష్ఇండియాప్రతినిధి :** గురు సమానులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నివాసంలో రాజ్యసభ సభ్యులు వేము నరేందర్ రెడ్డిని సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఈర్షద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) మర్యాదపూర్వకలు కలిసి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. వారి ఆప్యాయత ఆత్మీయ పలకరింపు తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# ఘట్‌కేసర్‌లో శ్రీ శ్రీనివాస మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ను ప్రారంభం





**ఘట్కేసర్,ఫ్లాష్ఇండియా ప్రతినిధి :** మల్కాజ్గిరి కార్పొరేషన్ ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని ఘట్‌కేసర్ డివిజన్, జగదాంబ థియేటర్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ శ్రీనివాస మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ (డీసీసీ) అధ్యక్షులు తోటకూర వజ్రెష్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా వజ్రెష్ యాదవ్ మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండడం ఎంతో అవసరమని అన్నారు. ఆధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన శ్రీ శ్రీనివాస మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఘట్‌కేసర్‌తో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వైద్య రంగంలో ఇటువంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. ఆసుపత్రి నిర్వాహకులు పన్నాల శ్రీనివాస్ రెడ్డిని అభినందిస్తూ, ప్రజలకు సేవాభావంతో వైద్య సేవలు అందించాలని సూచించారు. అనంతరం ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి వైద్య సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెట్ కమిటీ ఛైర్మెన్ బొమ్మలపల్లి నరసింహులు యాదవ్,ఘట్కేసర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొక్క ప్రభాకర్ రెడ్డి, మాజీ ఛైర్మెన్ మల్లి పావని జంగయ్య యాదవ్ ,మాజీ సొసైటీ బ్యాంకు ఛైర్మెన్ సింగిరెడ్డి రామ్ రెడ్డి,గద్దన్నారం ఫ్రూట్స్ మార్కెట్ డైరెక్టర్ మచందర్ రెడ్డి,యూత్ అధ్యక్షులు బొక్క సంజీవ రెడ్డి,రాధా కృష్ణ, ఉల్లి ఆంజనేయులు, కదుపులో మల్లేష్ , కొంతం అంజి రెడ్డి,తదితరులు పాల్గొన్నారు ప్రజాప్రతినిధులు,వైద్యులు, స్థానిక నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బిడ్డ దగ్గరికి వచ్చి, అనంతలోకాలకు తండ్రి



**వెల్గటూర్,ఫ్లాష్ ఇండియా :** ఎండపల్లి మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం మడక గ్రామానికి చెందిన దాస రాజు అనే వ్యక్తి స్పాట్ లోనే మృతి చెందాడు. రాజు ఈ ప్రాంతంలోనే ఉన్న తన కూతురు దగ్గరకు వెళ్లి సాయంత్రం స్వగ్రామానికి తిరిగి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. ద్విచక్రవాహనం పై ధర్మారం వైపు వెళ్తున్న రాజును ఎండపల్లి పెట్రోల్ బంక్ వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తల పగిలి రాజు స్పాట్ లోనే దారుణంగా మృతి చెందాడు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృత దేహాన్ని స్వాదీనం చేసుకొని రోడ్డు క్లియర్ చేశారు.

# విద్య హక్కు చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలి



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** రాష్ట్రంలోని విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాలైన ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్‌బీ, ఏఐఎఫ్‌డీఎస్, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌లో భాగంగా మిర్యాలగూడ నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌బీ ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పరంగి రాము, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు కుర్ర సైదా నాయక్, ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర కోశాధికారి పోతుగంటి కాశి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు యశ్వంత్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను 27 వేల నుంచి 4 వేలకే పరిమితం చేయాలనే ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని ఇప్పటి వరకు నియమించకపోవడం విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే చర్యగా పేర్కొంటూ, వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించాలని కోరారు. అలాగే విద్య హక్కు చట్టం (ఆర్‌టీఈ)ను పూర్తిస్థాయిలో అమలు చేయడంతో పాటు ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజు నియంత్రణ బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు, ఎంఈఓలు, డీఈఓలు, లెక్చరర్ల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని, మధ్యాహ్న భోజన పథకానికి నిధులు పెంచి మహిళా సంఘాల ద్వారా నిర్వహించాలని కోరారు. అలాగే మెస్, కాస్మెటిక్ చార్జీలను పెంచి పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, బెస్ట్ అవైలబుల్ స్కీమ్‌కు రూ. 250 కోట్లు కేటాయించాలని, ఎన్ఈపీ--2020 అమలుపై అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. గత ఆరు సంవత్సరాలుగా స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ. 10,500 కోట్లకు పైగా పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయడంతో పాటు విద్యార్థులకు ఉచిత బస్సు పాస్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్‌బీ, ఏఐఎఫ్‌డీఎస్, ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తుంగతుర్తి కాంగ్రెస్ వర్గ విభేదాలపై అధిష్టానం దృష్టి..



**తుంగతుర్తి,ఫ్లాష్ ఇండియా :** రోజురోజుకు వర్గ విభేదాలతో మందుతున్న తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీపై అధిష్టానం సృష్టి సాధించింది. సమస్యలను పరిష్కరించేందుకుగాను పార్టీ అధిష్టానం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డిని నియమించింది. నియోజకవర్గంలోని మోత్కూర్, తిరుమలగిరి, అడ్డగూడూరు, శాలిగౌరారం, నాగారం, జాజిరెడ్డిగూడెం, తుంగతుర్తి, మద్దిరాల, నూతనకల్ మండలాలకు చెందిన నాయకులతో జగ్గారెడ్డి సమావేశమై పరిస్థితులను తెలుసుకోనున్నారు. అయితే ఇప్పటికే మూడు రోజుల క్రితం కాంగ్రెస్ పార్టీలోనే ఒక వర్గం వందలాది మంది క్యాడర్‌తో గాంధీభవన్‌ను ముట్టడించిన విషయం తెలిసిందే. అయితే ఆ సమయంలో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అందుబాటులో లేకపోవడంతో వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డికి ఒక వినతి పత్రం సమర్పించి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యే మందుల సామెల్ వైఖరిని ఎండబెట్టింది. జరిగిన విషయాన్ని అందుబాటులోకి వచ్చిన మహేష్ కుమార్ గౌడ్ జగ్గారెడ్డి పరిస్థితిని వివరించారు.

# మెదక్ పల్లిలో ఆకా సెంటర్ ప్రారంభించిన ఎమ్మెల్యే...



**తలకొండ పల్లి ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మెదక్‌పల్లి గ్రామంలో రైతుల సౌకర్యార్థం నూతనంగా ఏర్పాటు చేసిన సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ ఆకా సెంటర్‌ను కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి స్థానిక నేతలతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు స్థానికంగానే అందుబాటులో ఉండటం వల్ల వ్యవసాయానికి ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. రైతులకు ఈ ఆకా సెంటర్ అన్ని వేళలా ఉపయోగపడేలా నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం గ్రామంలోని ప్రత్యేక ఎన్యుమరేషన్ (బీఎల్ఓ) కేంద్రాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆకాశ సెంటర్ ను ప్రారంభించడానికి హాజరైన ఎమ్మెల్యేను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఓటరు జాబితా డిజిటలైజేషన్, నమోదు, సవరణ ప్రక్రియను స్వయంగా పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తలకొండపల్లి తహసీల్దార్ రమేష్‌తో మాట్లాడి ప్రతి బూత్‌కు అవసరమైన సిబ్బందిని ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే ఎంఈవో చంపా నాయక్‌తో కూడా ఫోన్‌లో మాట్లాడి ఈరోజే ఉపాధ్యాయులను నియమించి, రేపటి ఉదయం నుంచే ఎన్యుమరేషన్ ప్రక్రియ సజావుగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**ఓటు ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కు**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని కోరారు. ఓటు అనేది ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కు అని, నిర్లక్ష్యం చేయకుండా పేరు నమోదు, మార్పులు, చేర్పులు పూర్తిచేసుకోవాలని సూచించారు. కల్వకుర్తి నియోజకవర్గంలో గురువారం వరకు 13.6 శాతం మేర ప్రక్రియ పూర్తయిందని, వచ్చే పది రోజుల్లో పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి బూత్‌కు ఒక ఉపాధ్యాయుడిని సహాయకుడిగా నియమించి డిజిటలైజేషన్‌ను వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యట నరసింహ, ఆమనగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి ,తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాసు. శ్రీనివాస్ రెడ్డి, స్థానిక సర్పంచ్ రమేష్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు రామ్ లక్ష్మణ్,రాజు,భాగ్యమ్మ, బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు రమాదేవి, నాయకులు భగవాన్ రెడ్డి, మాజీ ఎంపీపీ రఘురాములు, కసిరెడ్డి విజేందర్ రెడ్డి, నరేందర్ గౌడ్, అవంచ నర్సింహారెడ్డి, శ్రీశైలం, మెరిగే గోపాల్ , రాజేందర్ నాయక్, రేణు రెడ్డి దేవి, రాములు,అజీమ్, కృష్ణ, గ్రామ నాయకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# 24 ఏళ్లుగా గూడు లేని బడి..




**కేసముద్రం,ఫ్లాష్ ఇండియా :** కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని బ్రహ్మంగారి తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు శాశ్వత భవనం లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం అద్దె భవనంలోని ఒకే గదిలో విద్యార్థులకు బోధన కొనసాగుతుండటంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. "వర్షాకాలం వస్తే మా పిల్లల పరిస్థితి ఏంటి? ఒకే గదిలో ఎలా చదువుకుంటారు?" అంటూ తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం అద్దె భవనంలోనే మధ్యాహ్న భోజనం వండాల్సి రావడం, సరైన తరగతి గదులు లేకపోవడం వల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. గ్రామస్తుల కథనం ప్రకారం, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన పాఠశాల భవన నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. గత ఏడాదే భవనం పూర్తి చేస్తామని చెప్పినప్పటికీ పనులు పూర్తికాలేదని వారు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం కొత్త ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు గడుస్తున్నా నిర్మాణం ఇంకా పూర్తికాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మౌలిక వసతులు లేని కారణంగా ఒకప్పుడు 30 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో ప్రస్తుతం కేవలం 12 మంది మాత్రమే చదువుకుంటున్నారని తెలిపారు. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించాల్సి వస్తోందని, ఇది ఆర్థికంగా భారంగా మారుతోందని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, నిలిచిపోయిన పాఠశాల భవన నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని శాశ్వత పాఠశాల భవనాన్ని త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



# ఇంగ్లండ్ కెప్టెన్ సంచలన వ్యాఖ్యలు!

ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భారత్ మరోసారి నిరాశపరిచింది. బ్రిస్టల్‌లోని కౌంటీ గ్రౌండ్ వేదికగా గురువారం రాత్రి జరిగిన నాలుగో టీ20లో టీమిండియా 9 వికెట్ల తేడాతో చిత్తుగా ఓడింది. ఈ ఓటమితో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 3-0తో సిరీస్‌ను కోల్పోయింది. ఈ మ్యాచ్‌లో 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచిన ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్.. జట్టు ప్రదర్శనపై సంతోషం వ్యక్తం చేశాడు. భారత జట్టును ఓడించడం ఎప్పుడూ ప్రత్యేకమేనని పేర్కొన్నాడు. పటిష్ట టీమిండియాపై సిరీస్ గెలవడం తమకు ఎంతో సంతోషంగా ఉందని చెప్పాడు.

**భారత్‌ను ఓడించడం ఎప్పుడూ ప్రత్యేకమే:**

నాలుగో టీ20 మ్యాచ్ అనంతరం హ్యారీ బ్రూక్ మాట్లాడుతూ.. 'ఈరోజు మ్యాచ్ ఎంతో సరదాగా సాగింది. ఎన్నో ఏళ్లుగా భారత జట్టు ప్రపంచ క్రికెట్‌లో బలమైన జట్లలో ఒకటిగా ఉంది. అలాంటి జట్టును 3-0తో ఓడించి సిరీస్ గెలవడం మాకు ఎంతో సంతోషంగా ఉంది. మా ఆటగాళ్లంతా అన్ని విభాగాల్లో అద్భుతంగా రాణించారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ ఇలా ప్రతి విభాగంలో సమిష్టి ప్రదర్శన కనబరిచాం. ఐయామ్ ఫుల్ హ్యాపీ' అని చెప్పాడు.

**మా బలమే బ్యాటింగ్ డెప్త్:**

'మాకు లోతైన బ్యాటింగ్ లైనప్ ఉంది. ఈ మ్యాచ్‌లో రెహాన్ అహ్మద్‌ను ఎనిమిదో స్థానంలో ఆడించాం. అతను కూడా భారీ షాట్లు ఆడగలడు. బ్రిస్టల్ మైదానంలో బౌండరీలు చిన్నగా ఉండటంతో బ్యాటింగ్ పైనే ఎక్కువ దృష్టి పెట్టాం. అదే మాకు విజయాన్ని అందించింది. జట్టు విజయానికి ఆటగాళ్లు, కోచ్‌ల మధ్య ఉన్న సమన్వయమే ప్రధాన కారణం. పిచ్‌కు తగ్గట్టుగా ఎలా ఆడాలనే విషయంపై కోచ్‌లతో నిరంతరం చర్చించాం. ఆటగాళ్లు, కోచ్‌ల మధ్య జరిగిన కమ్యూనికేషన్ బాగుంది. సీనియర్ ఆటగాళ్లు కూడా బౌలర్లకు, యువ క్రికెటర్లకు ఎప్పటికప్పుడు సూచనలు ఇచ్చారు. జోఫ్రా ఆర్చర్, జోష్ టంగ్ బౌలింగ్‌లో అద్భుతంగా రాణించారు. వికెట్‌కీపర్ జోస్ బట్లర్ స్పిన్నర్లకు కీలక సూచనలు చేస్తూ జట్టుకు ఎంతో ఉపయోగపడ్డాడు' అని బ్రూక్ వివరించాడు.

**ప్రపంచ నంబర్ వన్ లక్ష్యం:**


టీ20ల్లో ప్రపంచ నంబర్ వన్ జట్టుగా ఎదగాలన్నదే తమ తదుపరి లక్ష్యమని హ్యారీ బ్రూక్ స్పష్టం చేశాడు. 'ప్రపంచ నంబర్ వన్ జట్టుగా మారడం ఎంతో గొప్ప విషయం. అదే మా లక్ష్యం. ఈ సిరీస్‌లో ఇప్పటివరకు ఆడిన విధానాన్నే కొనసాగిస్తాం. మా ప్రణాళికలను మార్చకుండా ముందుకు వెళ్తాం. చివరి మ్యాచ్‌లోనూ గెలిచి 4-0తో సిరీస్‌ను ముగించాలని ఆశిస్తున్నాం' అని ఇంగ్లండ్ బ్రూక్ ధీమా వ్యక్తం చేశాడు. ఈ ఓటమితో భారత్ సిరీస్‌ను కోల్పోగా.. చివరి టీ20లోనైనా గెలిచి పరువు నిలబెట్టుకోవాలని చూస్తోంది. మరోవైపు ఇంగ్లండ్ మాత్రం చివరి మ్యాచ్‌లోనూ విజయం సాధించి 4-0తో సిరీస్‌ను ముగించాలని ఉవ్విళ్లూరుతోంది. ప్రస్తుతం భారత్ ఆటతీరు చూస్తుంటే భారత్‌కు విజయం అంత ఈజీ కాదు.

# మెగా టోర్నీల్లో మొనగాళ్లు.. ద్విపాక్షిక సిరీస్‌ల్లో వైఫల్యాలు..



టీమిండియా అహ్మదాబాద్ గడ్డపై టీ20 వరల్డ్ కప్ 2026 ట్రోఫీని ముద్దాడి నాలుగు నెలలు కూడా గడవకముందే.. ఊహించని పరాజయాల సుడిగుండంలో చిక్కుకుంది. మొదట ఐర్లాండ్ జట్టు ప్రపంచ ఛాంపియన్ భారత్‌ను వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓడించి చారిత్రాత్మక 2-0 క్లీన్‌స్వీప్‌తో షాకిచ్చింది. ఆ తర్వాత ఇంగ్లాండ్ పర్యటనలోనూ అదే పరిస్థితి పునరావృతమైంది. నాటింగ్‌హామ్‌లో కేవలం 76 పరుగులకే కుప్పకూలి, 125 పరుగుల భారీ తేడాతో పరాజయం పాలైంది. ఆపై బ్రిస్టల్‌లో జరిగిన మ్యాచ్‌లోనూ 9 వికెట్ల తేడాతో ఓడిపోవడంతో, ఇంగ్లాండ్ మొదటిసారి భారత్‌పై ద్విపాక్షిక టీ20 సిరీస్‌ను కైవసం చేసుకుంది. ఫలితంగా, భారత్ వరుసగా 5 పూర్తిస్థాయి టీ20 మ్యాచ్‌ల్లో ఓటమి చవిచూడాల్సి వచ్చింది.గౌతమ్ గంభీర్ నేతృత్వంలోని ఈ జట్టు 2025లో అజేయంగా ఛాంపియన్స్ ట్రోఫీని, ఆ తర్వాత ఆసియా కప్‌ను గెలుచుకుంది. ఆపై 2026 టీ20 వరల్డ్ కప్ ఫైనల్లో న్యూజిలాండ్‌ను 96 పరుగుల తేడాతో చిత్తు చేసి టైటిల్‌ను నిలబెట్టుకుంది. ఈ మూడు మెగా టోర్నీలలో కలిపి భారత్ ఓడిపోయింది కేవలం సౌతాఫ్రికాపై ఒకే ఒక్క మ్యాచ్‌లో మాత్రమే! ఐతే, టోర్నమెంట్లు వస్తే చారిత్రాత్మక ఫామ్‌తో తిరుగులేని విజేతగా నిలిచే టీమిండియా.. ద్విపాక్షిక సిరీస్‌ల విషయానికి వస్తే మాత్రం చేతులెత్తేయడం భారత క్రికెట్ చరిత్రలోనే అత్యంత విచిత్రమైన కాలంగా మారుతోంది. ఇక, భారత క్రికెట్ చరిత్రను పరిశీలిస్తే.. ఇలాంటి భిన్నమైన పరిస్థితులు గతంలోనూ కనిపిస్తాయి. 1983లో వెస్టిండీస్‌ను ఓడించి వరల్డ్ కప్ గెలవడం, ఆ మరుసటి ఏడాదే తొలి ఆసియా కప్ దక్కించుకోవడం, ఆపై 1985లో వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ క్రికెట్‌లో అజేయంగా నిలవడం.. ఇవన్నీ ఒకెత్తయితే, అదే సమయంలో జరిగిన ద్విపాక్షిక సిరీస్‌లలో భారత్ దారుణంగా విఫలమైంది. వరల్డ్ కప్ ముగిసిన వెంటనే భారత్‌కు వచ్చిన వెస్టిండీస్.. టెస్టు సిరీస్‌ను 3-0తో, వన్డే సిరీస్‌ను 5-0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఆ తర్వాత ఇంగ్లాండ్ కూడా భారత్‌పై టెస్టుల్లో 2-1తో, వన్డేల్లో 4-1తో గెలిచింది. అప్పట్లో ఆనాటి ఓటములు ఒక ఎదుగుతున్న శక్తి సహజ తడబాటును సూచించాయి తప్ప, ఒక తిరుగులేని వ్యవస్థ కుప్పకూలడాన్ని కాదు.మరోవైపు ఎంఎస్ ధోనీ సారథ్యంలో 2011 వరల్డ్ కప్ గెలిచిన వెంటనే ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా పర్యటనల్లో భారత్ టెస్టు సిరీస్‌లను 4-0తో ఘోరంగా చేజార్చుకుంది. 2012 చివర్లో ఇంగ్లాండ్ జట్టు భారత్‌కు వచ్చి టెస్టు సిరీస్‌ను 2-1తో గెలుచుకుంది. కానీ, ఆ తర్వాత కొన్ని నెలలకే ఆస్ట్రేలియాను స్వదేశంలో 4-0తో క్లీన్‌స్వీప్ చేసిన ధోనీ సేన.. ఇంగ్లాండ్‌లో జరిగిన 2013 ఛాంపియన్స్ ట్రోఫీని ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా ముద్దాడింది. ఆ కాలంలో వైఫల్యాలు ఫార్మాట్లు, పిచ్ పరిస్థితులపై ఆధారపడి ఉండేవి. భారత్ సీనియర్ టెస్టు జట్టు విదేశాల్లో ఇబ్బంది పడగా, యువతతో కూడిన వన్డే జట్టు మాత్రం ప్రపంచాన్ని శాసించింది. కానీ ప్రస్తుత ఒడిదుడుకులు కేవలం ఫార్మాట్ లేదా వాతావరణంపై ఆధారపడి లేవు. ఇది కేవలం సందర్భం (ాఎఘుంఅశీఅ) బట్టి మారుతోంది. ఇటీవల భారత్ టెస్టుల్లో న్యూజిలాండ్ చేతిలో స్వదేశంలో 3-0తో ఘోరంగా క్లీన్‌స్వీప్ అవ్వడమే కాకుండా, సౌతాఫ్రికాలోనూ సిరీస్ ఓడిపోయింది. వన్డేల్లో శ్రీలంక చేతిలో 27 ఏళ్ల తర్వాత సిరీస్ ఓటమిని చవిచూసింది. 2026 జనవరిలో న్యూజిలాండ్ జట్టు భారత గడ్డపై తన మొదటి వన్డే సిరీస్ విజయాన్ని నమోదు చేసింది. ఇప్పుడు ఏకంగా టీ20 వరల్డ్ ఛాంపియన్లు ఐర్లాండ్, ఇంగ్లాండ్‌ల చేతిలో ఘోరంగా పరాజయం పాలయ్యారు. దీనిని బట్టి, ఒక ఫార్మాట్‌లో రాణించి మరో ఫార్మాట్‌లో విఫలమవ్వడం లేదు. ఒకే ఫార్మాట్‌లో అత్యుత్తమంగానూ, అదే సమయంలో అత్యంత పేలవంగానూ ఆడుతున్నారు. మెగా టోర్నీలు ఆడేటప్పుడు ప్రయోగాలకు తెరపడి, సీనియర్ ఆటగాళ్లు జట్టులోకి వస్తారు. ఎవరి పాత్ర ఏంటో స్పష్టత ఉంటుంది కాబట్టి ఆటలో క్రమశిక్షణ కనిపిస్తుంది. కానీ ద్విపాక్షిక సిరీస్‌లు ఒక ప్రయోగశాలగా మారుతున్నాయి. కెప్టెన్లు మారుతున్నారు, సీనియర్లకు విశ్రాంతి ఇస్తున్నారు, యువ ఆటగాళ్లను ముందే ప్రవేశపెడుతూ బ్యాటింగ్ ఆర్డర్‌లో విపరీతమైన మార్పులు చేస్తున్నారు. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ శైలి కూడా ఇందుకు ఒక కారణం కావచ్చు. అతని వ్యూహం ఎల్లప్పుడూ దూకుడు, పటిష్టమైన బ్యాటింగ్ డెప్త్‌పైనే ఉంటుంది. మెగా టోర్నీలలో ఈ వ్యూహం ప్రత్యర్థులను ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. కానీ అనుభవం లేని యువ జట్టుతో ద్విపాక్షిక సిరీస్‌లలో అదే దూకుడును ప్రదర్శిస్తే.. ప్రారంభంలోనే వికెట్లు పడిపోయినప్పుడు జట్టులో తీవ్ర అభద్రతా భావం ఏర్పడుతోంది. ఇక, గతంలో భారత్ వరుసగా ద్విపాక్షిక సిరీస్‌లు గెలిచి, మెగా టోర్నీలలో ట్రోఫీలు గెలవలేకపోతోందని అభిమానులు విమర్శించేవారు. గంభీర్ వచ్చాక ఆ సమీకరణం పూర్తిగా మారిపోయింది. ప్రస్తుతానికి ఈ ఒప్పందం అభిమానులకు నచ్చుతోంది. ద్విపాక్షిక సిరీస్‌ల ఓటములు, ప్రయోగాలు లేదా అవమానాలను అయినా భరించడానికి సిద్ధంగా ఉన్నారు.. కానీ దానికి బదులుగా ఐసీసీ ట్రోఫీలు చేతికి రావాలి. ట్రోఫీలు గెలుస్తున్నంత కాలం గంభీర్ శకం విజయవంతంగానే కనిపిస్తుంది.

# బిజినెస్



## అమెరికా కోర్టుకు అదానీ

అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ మరోసారి అమెరికా కోర్టు మెట్లు ఎక్కనున్నారు. అదానీ - అమెరికా లీగల్ వివాదంలో తనపై ఉన్న క్రిమినల్ అభియోగాలను పూర్తిగా కొట్టివేయాలన్న అమెరికా ప్రభుత్వ నిర్ణయానికి సంబంధించి, గౌతమ్ అదానీ ఈవారంలోనే అమెరికా కోర్టులో ఒక కీలక అఫిడవిట్ సమర్పించనున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. కేసు ఉపసంహరణ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరిగిందా లేదా అని నిర్ధారించుకోవడానికే న్యాయస్థానం ఈ చర్యలకు ఉపక్రమించినట్లు సమాచారం.గౌతమ్ అదానీపై ఉన్న అభియోగపత్రాన్ని శాశ్వతంగా కొట్టివేయాలని అమెరికా న్యాయశాఖ కోర్టును అభ్యర్థించింది. అయితే, ఈ అభ్యర్థనపై తుది తీర్పు ఇచ్చే ముందే, అంటే ఈనెల 15వ తేదీ లోపు అదానీ తన ప్రమాణ పత్రాన్ని దాఖలు చేయాలని అమెరికా కోర్టు న్యాయమూర్తి గడువు విధించారు. ఈ అఫిడవిట్‌లో గౌతమ్ అదానీ ముఖ్యంగా తనపై ఉన్న కేసును ఉపసంహరించుకోవడానికి బదులుగా అమెరికా ప్రభుత్వంతో వెనుక ఎలాంటి వాగ్దానాలు, ప్రతిపాదనలు లేదా రహస్య ఒప్పందాలు జరిగాయా అనే విషయాలను స్పష్టం చేయాల్సి ఉంటుంది.దీనితో పాటు, ఈ కేసును కొట్టివేయడం ద్వారా ప్రభుత్వానికి లేదా

ఇతరులకు ఏదైనా లబ్ధి చేకూర్చడం వంటి విషయాలు ఆయనకు తెలుసా అనేది కూడా అందులో పేర్కొనాలని న్యాయమూర్తి ఆదేశించారు. ఈనెల 15వ తేదీ లోగా గౌతమ్ అదానీ సమర్పించబోయే ఈ ప్రమాణ పత్రం ఆధారంగానే, అమెరికా కోర్టు ఈ హై-ప్రొఫైల్ క్రిమినల్ కేసు కొట్టివేతపై తన తుది నిర్ణయాన్ని వెలువరించనుంది.





## మార్కెట్లో నిస్సాన్ 'టెక్టాన్' ఎంట్రీ

ప్రముఖ కార్ల తయారీ సంస్థ నిస్సాన్ ఇండియా దేశీయ మార్కెట్లో కొత్త ఎస్‌యూవీని విడుదల చేసింది. మిడ్-సైజ్ ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో తన ఉనికిని బలోపేతం చేయడానికి కంపెనీ కొత్త 'టెక్టాన్' ఎస్‌యూవీని విడుదల చేసింది. రూ.10.49 లక్షల (ఎక్స్‌షోరూమ్) ప్రారంభ ధరతో వచ్చిన ఈ మోడల్ ప్రస్తుతం కంపెనీ లైనప్‌లోనే అత్యంత ప్రీమియం ఎస్‌యూవీగా నిలిచింది. బుకింగ్‌లు ఇప్పటికే ప్రారంభమవగా, జూలై 20 నుంచి డెలివరీలు అందించనున్నట్టు కంపెనీ తెలిపింది. డిజైన్ పరంగా టెక్టాన్ బోల్డ్ ఫ్రంట్ గ్రిల్, ఎల్‌ఈడీ హెడ్‌ల్యాంప్స్, సీ-ఆకారపు డీఆర్‌ఎల్, 18 అంగుళాల అల్లాయ్ వీల్స్, మస్కులర్ బాడీ డిజైన్‌తో తెచ్చినట్టు నిస్సాన్ ఇండియా వివరించింది.ఈ కారు ప్రీమియం ఎస్‌యూవీల స్థాయిలో 10.1 అంగుళాల టచ్‌స్క్రీన్, 10.25 అంగుళాల డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, గూగుల్ బిల్ట్-ఇన్, వైర్‌లెస్ ఛార్జర్, వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్లు, డ్యూయెల్-జోన్ క్లైమేట్ కంట్రోల్, పానరోమిక్ సన్‌రూఫ్, పవర్డ్ టెయిల్‌గేట్, అడాప్టివ్ క్రూయిజ్ కంట్రోల్ వంటి ఫీచర్లు ఉన్నాయి. భద్రత విషయంలో 5-స్టార్ బీఎన్‌క్యాప్ రేటింగ్, 6 ఎయిర్‌బ్యాగ్స్, 360-డిగ్రీ కెమెరా, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, అలాగే అడాస్ ఫీచర్లు అందించింది. 1.0-లీటర్ (100 హెచ్‌పీ), 1.3-లీటర్ టర్బో పెట్రోల్ (163 హెచ్‌పీ) ఇంజిన్ ఆప్షన్లు ఉండగా, 6-స్పీడ్ మాన్యువల్, 7-స్పీడ్ డీసీటీ గేర్‌బాక్స్ ఆప్షన్లు ఉన్నాయి. మైలేజీ లీటర్‌కు 18.5 నుంచి 19.4 కి.మీ వరకు ఉంటుందని కంపెనీ తెలిపింది. ఈ మోడల్ ప్రస్తుతం మార్కెట్లో ఉన్న హ్యుందాయ్ క్రెటా, కియా సెల్టోస్, టయోటా అర్బన్ క్రూజర్ హైరైడర్, హోండా ఎలివేట్, టాటా సియెర్రా, రెనాల్ట్ డస్టర్ వంటి ఎస్‌యూవీలకు గట్టి పోటీ ఇవ్వనుంది.

## భారత్ వృద్ధి అంచనాల్లో ఏడీబీ కోత

భారత ఆర్థికవ్యవస్థపై ఇంధన ధరల భారం పెరుగుతున్న నేపథ్యంలో ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ఏడీబీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వృద్ధి అంచనాను 6.9 శాతం నుంచి 6.6 శాతానికి తగ్గించింది. అయితే వచ్చే 2027-28 ఆర్థిక సంవత్సరంలో 7.3 శాతం వృద్ధి సాధించగలదని అభిప్రాయపడింది. పశ్చిమాసియా ఉద్రిక్తతల కారణంగా చమురు ధరలు పెరగడం దేశీయ డిమాండ్‌పై ప్రభావం చూపుతుందని, అదే కారణంతో ఈ కోత విధించినట్లు ఏడీబీ తన తాజా ఏషియన్ డెవలప్‌మెంట్ ఔట్‌లుక్ నివేదికలో తెలిపింది. ఈ అంచనాలు ఇటీవల ఆర్‌బీఐ ప్రకటించిన 6.6 శాతం వృద్ధి అంచనాతో సరిపోగా, ఐఎంఎఫ్ కూడా ఇటీవల 6.5 శాతం నుంచి 6.4 శాతానికి వృద్ధి అంచనాలను తగ్గించిన వెంటనే ఏడీబీ నివేదిక రావడం గమనార్హం. అయినప్పటికీ వేగంగా ఎదుగుతున్న ప్రధాన ఆర్థికవ్యవస్థల్లో భారత్ ముందంజలోనే ఉంటుందని ఏడీబీ విశ్వాసం వ్యక్తం చేసింది. విదేశీ పెట్టుబడులను ఆకర్షించే విధానాలు, ఇంధన పన్నుల తగ్గింపు, ప్రభుత్వ మూలధన వ్యయం,



బలమైన సేవల ఎగుమతులు వంటి అంశాలు వృద్ధికి బలమవుతాయని పేర్కొంది. మరోవైపు పశ్చిమాసియా ఉద్రిక్తతలు కొనసాగితే ఇంధన ధరలతో పాటు ఎరువులు, సరఫరా గొలుసుపై ఒత్తిడి పెరిగి ద్రవ్యోల్బణం అధికంగా ఉండే ప్రమాదం ఉందని, అధిక వడ్డీ రేట్లు, పెరుగుతున్న రుణ వ్యయం, వాణిజ్య అనిశ్చితులు కూడా ఆసియా-పసిఫిక్ ప్రాంత ఆర్థిక వ్యవస్థలకు సవాళ్లుగా మారవచ్చని ఏడీబీ హెచ్చరించింది.

## ఇన్సూరెన్స్ రంగంలో కొత్త అధ్యాయం




భారత బీమా రంగంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. బ్రిటన్‌కు చెందిన బీమా దిగ్గజం అవివా తన భారత భాగస్వామి డాబర్ ఇన్వెస్ట్ కార్ప్ వద్ద ఉన్న మిగిలిన 26 శాతం వాటాను కొనుగోలు చేయడానికి అంగీకరించింది. దీంతో అవివా లైఫ్ ఇన్సూరెన్స్ ఇండియాపై 100 శాతం యాజమాన్యం సాధించిన తొలి విదేశీ జీవిత బీమా సంస్థగా నిలిచింది. కేంద్ర ప్రభుత్వం ఇటీవల బీమా రంగంలో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు (ఎఫ్‌డీఐ) అనుమతి ఇచ్చిన తర్వాత జరిగిన తొలి ప్రధాన ఒప్పందం ఇదే. 2001లో డాబర్‌తో జాయింట్ వెంచర్‌గా భారత మార్కెట్లోకి అడుగుపెట్టిన అవివా, 2016లో తన వాటాను 49 శాతానికి, 2022లో 74 శాతానికి పెంచుకుంది. తాజా కొనుగోలుతో రెండు దశాబ్దాలకుపైగా కొనసాగిన జాయింట్ వెంచర్‌కు ముగింపు పలుకుతూ కంపెనీ పూర్తి నియంత్రణను తన చేతుల్లోకి తీసుకుంది. అయితే ఈ లావాదేవీ విలువను అవివా వెల్లడించలేదు.పూర్తి యాజమాన్యంతో అవివాకు భారత మార్కెట్‌లో వేగంగా నిర్ణయాలు తీసుకునే అవకాశం, అదనపు పెట్టుబడులు పెట్టే స్వేచ్ఛ, వ్యాపార విస్తరణకు మరింత అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం అవివా ఇండియా నిర్వహణలో రూ.16,316 కోట్ల ఆస్తులు ఉండగా, FY26లో రూ.1,343 కోట్ల ప్రీమియం ఆదాయం నమోదు చేసింది. కొత్త వ్యాపార ప్రీమియం 10 శాతం పెరిగినా, నికర లాభం 21.7 శాతం తగ్గి రూ.84.15 కోట్లకు చేరింది. సంస్థ సాల్వెన్సీ నిష్పత్తి 188 శాతంగా ఉండటం ఆర్థికంగా మెరుగైన స్థితిని సూచిస్తున్నప్పటికీ, పరిమిత బ్రాంచుల నెట్‌వర్క్ కారణంగా మార్కెట్ వాటా పెంపులో సవాళ్లు ఎదుర్కొంటోంది. అయినప్పటికీ 100 శాతం ఎఫ్‌డీఐ విధానం అమల్లోకి వచ్చిన తర్వాత అవివా తీసుకున్న ఈ నిర్ణయం, భారత్‌లో పూర్తి యాజమాన్యం కోసం ఎదురు చూస్తున్న ఇతర విదేశీ బీమా కంపెనీలకూ మార్గదర్శకంగా మారే అవకాశముందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.




# ఏదో ఒక కొత్త విషయాన్ని నేర్పుతుంది..

రాశీ ఖన్నా ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఓ ఎమోషనల్ నోట్‌ను పంచుకున్నారు. "ప్రతి షూటింగ్ షెడ్యూల్ మనకు ఏదో ఒక కొత్త విషయాన్ని నేర్పుతుందని నేను ఎప్పుడూ నమ్ముతాను. మన చుట్టూ ఉండే మనుషుల నుంచే మనకు నిజమైన బలం వస్తుందని ఈ షెడ్యూల్ నాకు మరోసారి గుర్తుచేసింది. షూటింగ్ మధ్యలో అనారోగ్యం బారిన పడటం అనేది ఎవరికైనా చాలా కష్టమైన విషయం.ఒకానొక దశలో శారీరకంగా నన్ను నేను చాలా పుష్ చేసుకోవాల్సి వచ్చింది. కానీ అలాంటి సమయంలో నా మేనల్లుడి నుంచి వచ్చిన ఒక చిన్న హగ్, ఫ్యామిలీ మెంబర్స్ చేసిన ఫోన్ కాల్స్, అలాగే సెట్స్‌లో ఉన్న ప్రతి ఒక్కరూ వచ్చి నువ్వు బాగున్నావా? అని అడిగిన పలకరింపులు నా కష్టాన్ని దూరం చేశాయి. ఆ ప్రేమతో నా రోజంతా ఎంతో తేలికగా మారిపోయేది" అని చెప్పుకొచ్చారు. అంతేకాకుండా ఈ సినిమాలో కొన్ని భారీ యాక్షన్ సీన్స్ కూడా చేసినట్లు రాశీ ఖన్నా హింట్ ఇచ్చారు. యాక్షన్ సీక్వెన్స్ షూట్ చేస్తున్నప్పుడు ఒంటిపై కొన్ని దెబ్బలు కూడా తగిలాయని, తాను చేసిన కెరీర్ లోనే ఇది అంత సులువైన షెడ్యూల్ ఏమీ కాదని ఆమె అన్నారు. అయితే, ఇదంతా ఎంతో మంది మంచి మనసున్న మనుషుల మధ్య జరిగిందని సంతోషం వ్యక్తం చేశారు. "ఈ సినిమా షెడ్యూల్ ముగిసిన తర్వాత నాకు ఆ అలసట ఏమాత్రం గుర్తుకు రావడం లేదు.. కేవలం అందరిపై ఉన్న కృతజ్ఞతాభావం మాత్రమే మిగిలింది. కెమెరాలు ఆగిపోయిన తర్వాత కూడా ఇవే జ్ఞాపకాలు నా జీవితాంతం నాతో పాటే ఉండిపోతాయి" అంటూ రాశీ ఖన్నా రాసుకొచ్చారు.

# ఎట్టకేలకు పూర్తయిన జన నాయగన్ సెన్సార్..




కోలీవుడ్ స్టార్ హీరో, తమిళనాడు ముఖ్యమంత్రి దళపతి విజయ్ అభిమానులు ఎంతో కాలంగా, అత్యంత ఆసక్తిగా ఎదురుచూ- స్తున్న క్షణం రానే వచ్చింది. ఎన్నో వివాదాలు, మరెన్నో అడ్డంకులను అధిగమించి, ఆయన తాజా చిత్రం జననాయగన్' ఎట్టకేలకు సెన్సార్ ఫార్మాలిటీస్‌ను విజయవంతంగా పూర్తి చేసుకుంది. ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు A' సర్టిఫికేట్‌ను జారీ చేసింది. సెన్సార్ సర్టిఫికేట్ వివరాల ప్రకారం సినిమా నిడివి (183.11 నిమిషాలు (అంటే దాదాపు 3 గంటల 3 నిమిషాల సుదీర్ఘ రన్‌టైమ్) ఉ ఒడనుంది.హెచ్. వినోద్ దర్శకత్వంలో పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రం గత కొన్ని నెలలుగా సెన్సార్ ఇష్యూస్, లీకేజీల వంటి పలు సమస్యల వల్ల వాయిదా పడుతూ వచ్చింది. అయితే, సెన్సార్ బోర్డు సూచించిన మార్పులన్నింటినీ పూర్తి చేసి, జూలై 9, 2026 నాటి అధికారిక క్లియ= ఒన్స్‌తో చిత్ర యూనిట్ ఊపిరి పీల్చుకుంది. విజయ్ రాజకీయాల్లోకి పూర్తిస్థాయిలో ప్రవేశించిన తర్వాత విడుదలవుతున్న సినిమా, ఆయన కెరీర్ లో చివరి సినిమా కావడంతో, దీనిపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. థియేటర్లలో మాస్ విస్ఫోటనాన్ని చూసేందుకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులు సిద్ధమవుతున్నారు. తాజా సమాచారం ప్రకారం, ఈ చిత్రం జూలై 24న ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున థియేటర్లలో విడుదల కానుంది.

# ఫస్ట్ లుక్ అదిరింది




మలయాళ స్టార్ నటుడు దుల్కర్ సల్మాన్ హీరోగా, పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తున్న కొత్త సినిమా కొన్ని రోజుల క్రితమే ప్రారంభమైన విషయం తెలిసిందే. ఇన్ని రోజులపాటు ఈ చిత్రానికి అధికారిక టైటిల్‌ను ప్రకటించకపోవడంతో 'DQ41' అనే వర్కింగ్ టైటిల్‌తో షూటింగ్ కొనసాగించారు. తాజాగా చిత్ర బృందం ఈ సినిమా టైటిల్‌తో పాటు ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ చిత్రానికి 'శ్రీ శ్రీ' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో దుల్కర్ సల్మాన్, పూజా హెగ్డే ప్రశాంతమైన వాతావరణంలో గోడపై కూర్చొని చిరునవ్వులు చిందిస్తూ కనిపించారు. దీంతో ఇది ఓ హృద్యమైన ప్రేమకథగా తెరకెక్కుతున్నట్లు అర్థమవుతోంది.పోస్టర్‌పై "Love Will Spark Again" అనే ట్యాగ్‌లైన్‌ను జోడించడం మరింత ఆకర్షణగా నిలిచింది. ఈ చిత్రానికి రవి నెలకుడిటి కథ అందించడంతో పాటు దర్శకత్వం వహిస్తున్నారు. సుధాకర్ చెరుకూరి నిర్మాతగా వ్యవహరిస్తుండగా, జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు. ఈ సినిమాను తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో విడుదల చేయనున్నట్లు మేకర్స్ పోస్టర్ ద్వారా వెల్లడించారు. అలాగే, ఈ చిత్రం 2026లో ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో కనిపించిన విజువల్స్, ఫీల్ ప్రేక్షకుల్లో సినిమాపై మంచి ఆసక్తిని పెంచుతున్నాయి.

# లాభాల్లో 'విశ్వనాథ్ అండ్ సన్స్'..




ఈ నేపథ్యంలో 'విశ్వనాథ్ అండ్ సన్స్' చిత్రానికి విడుదలకు ముందే రూ.300 కోట్లకు పైగా ప్రీ-రిలీజ్ బిజినెస్ జరిగినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో నిర్మాతలు ఇప్పటికే లాభాల్లోకి వెళ్లినట్లు టాక్ వినిపిస్తోంది. ఈ చిత్రాన్ని ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ప్రస్తుతం ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. మరి బాక్సాఫీస్ వద్ద ఈ చిత్రం ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి. ఈ చిత్రంలో మమితా బైజు కీలక పాత్రలో నటిస్తుండగా, జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై ప్రముఖ నిర్మాత సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.






# తెలుగు వాళ్లే గ్రేట్..

తెలుగు సినిమాల్లో నటించే రోజుల్లో టాలీవుడ్ షూటింగ్ సెట్స్ చాలా పద్ధతిగా, ఆర్టిస్ట్‌లకు ఎంతో అనుకూలంగా ఉండేవని సోనాలి గుర్తు చేసుకున్నారు.హిందీ ఇండస్ట్రీతో పోలిస్తే తెలుగు ఇండస్ట్రీ వాళ్లు కథ, స్క్రిప్ట్ విషయంలో ఎంతో పక్కాగా ప్లాన్ చేసుకుని రెడీగా పెట్టుకునేవారని చెప్పారు. కానీ బాలీవుడ్‌లో కొన్ని సినిమాలకైతే షూటింగ్ స్పాట్‌కు వెళ్లిన తర్వాత కూడా అక్కడికక్కడే సీన్లు రాస్తూ ఉండేవారని, అది తనకు కొంచెం ఇబ్బందిగా అనిపించేదని ఆమె అసలు నిజాన్ని బయటపెట్టారు. తెలుగు సినిమాలు మేకింగ్ పరంగా చాలా పెద్దవని, వాటి బడ్జెట్, షూటింగ్ ప్లానింగ్ చూస్తే హిందీ సినిమాలు కూడా వాటితో సరితూగవని సోనాలి ప్రశంసించారు. అప్పట్లోనే షూటింగ్స్ కోసం రామోజీ ఫిల్మ్ సిటీ, అన్నపూర్ణ స్టూడియోలతో పాటు విదేశాలలోనూ భారీగా షెడ్యూల్స్ ప్లాన్ చేసేవారని పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. హిందీ ఇండస్ట్రీ కంటే తెలుగు వాళ్లే గ్రేట్ అని ఈ సందర్భంగా చెప్పారు. వీటన్నింటితో పాటు తెలుగు షూటింగ్ సెట్స్‌లో పెట్టే రకరకాల టిఫిన్స్, రుచికరమైన భోజనం అంటే తనకు చాలా ఇష్టమని సోనాలి పేర్కొన్నారు.

# ధనుష్ 'D57'కి ఆ ఒక్కటి తప్పు...



కోలీవుడ్‌లో ప్రస్తుతం అత్యంత చర్చనీయాంశంగా మారిన ప్రాజెక్టుల్లో ధనుష్ 'D57' ఒకటి. గత కొంతకాలంగా ఈ సినిమాపై భారీగా ప్రచారం జరుగుతోంది. ఇందులో ధనుష్ హీరోగా నటించనుండగా, జాన్వీ కపూర్ హీరోయిన్‌గా కనిపించనున్నట్లు తెలుస్తోంది. అలాగే ఈ చిత్రానికి వెంకట్ ప్రభు దర్శకత్వం వహించనున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ధనుష్, జాన్వీ కపూర్, వెంకట్ ప్రభు మధ్య చర్చలు పూర్తయ్యాయని, ప్రాజెక్ట్ దాదాపు ఖరారైనట్లు కోలీవుడ్ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. అయితే అన్ని అంశాలు దాదాపు సెట్ అయినప్పటికీ, ఇప్పటివరకు అధికారిక ప్రకటన రాకపోవడం మాత్రమే చిన్న సస్పెన్స్‌గా మారింది.అధికారిక ప్రకటన వెలువడితే ఈ ఏడాది తమిళ సినీ పరిశ్రవ- ఎలోనే అత్యంత క్రేజీ మూవీ అనౌన్స్‌మెంట్‌లలో ఇది ఒకటిగా నిలిచే అవకాశముందని కోలీవుడ్ మీడియా అభి- ప్రాయపడుతోంది. హిందీ చిత్రాల ద్వారా కెరీర్‌ను ప్రారంభించి మంచి గుర్తింపు తెచ్చుకున్న జాన్వీ కపూర్ ఇప్పటికే తెలుగులో పలు సినిమాల్లో నటించింది. ఇప్పుడు ధనుష్ 'D57' ద్వారా తమిళ సినీ పరిశ్రమలోకి కూడా అడుగుపెట్టనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ కారణంగానూ ఈ ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**